సోమవారం 23 నవంబరు 2026

https://www.telugudesam.org

చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

ఆళ్ళగడ్డ, మైదుకూరులో

రెచ్చిపోయిన వైసీపీ గుండాలు

- నామినేషన్ వేస్తున్న టీడీపీ మద్దతుదారులపై దాడి హేయం
- ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు

- వివరాలు 5 లో..

ఏకగ్రీవాలను ప్రోత్సహించాలి



- పంచాయతీ ఎన్నికలపై సీఎం చంద్రబాబు పిలుపు
- గ్రామాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలి
- ఏకగ్రీవ పంచాయతీలకు రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు నజరానా
- పార్టీ నేతల మధ్య పంతాలు, ఈగోలకు తావులేకుండా ఐక్యంగా పనిచేయాలి
- మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్

అమరావతి (చైతన్య రథం): గ్రామాల అభివృద్ధికి దోహదపడేలా పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవాలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు మంత్రులు, పార్టీ ముఖ్యనేతలకు సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. పార్టీ గుర్తులపై జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన నేపథ్యంలో, ఇక పంచాయతీ ఎన్నికలను గ్రామాభివృద్ధికి వేదికగా మలచుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు, రానున్న పంచాయతీ ఎన్నికలు, ఏకగ్రీవాల ప్రోత్సాహంపై ఆదివారం మంత్రులు, పార్టీ ముఖ్యనేతలతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మున్సిపల్, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి సాధించిన విజయం ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన గుర్తింపుగా ఆయన అభివర్ణించారు. స్థానిక ఎన్నికల ఫలితాలు ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాయని, పార్టీ గుర్తులపై జరిగిన ఎన్నికల్లో ప్రజలు తమ నిర్ణయాన్ని స్పష్టంగా వెల్లడించారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో విశ్వాసం ఉందని, స్థానిక ఎన్నికల ఫలితాలు ఆ నమ్మకాన్ని మరోసారి చాటాయని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో కూటమికి అనుకూలంగా ఏకపక్షంగా వచ్చిన ప్రజాభిప్రాయాన్ని వైసీపీ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. అందుకే ఇప్పటికీ తప్పుడు ప్రచారానికి పాల్పడుతోందని వ్యాఖ్యానించారు. పంచాయతీ ఎన్నికల్లోనూ ఇదే ప్రజాభిమానాన్ని ఓట్ల రూపంలోకి మలుచుకునేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు.

ఏకగ్రీవాలకు భారీ ప్రోత్సాహకాలు

పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరిగే ఇతర స్థానిక సంస్థల ఎన్నికలకు భిన్నమైనవని సీఎం స్పష్టం చేశారు. పార్టీల మధ్య రాజకీయ పోటీకి అతీతంగా గ్రామాల అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా తీసుకోవాలని చెప్పారు. గ్రామస్థులందరి ఆమోదంతో పంచాయతీలు ఏకగ్రీవమైతే, ప్రభుత్వం అందించే ప్రోత్సాహక నిధులతో స్థానికంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుందని తెలిపారు. 5 వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.15 లక్షలు, 5 వేల నుంచి 10 వేల మధ్య జనాభా ఉన్న పంచాయతీలకు రూ.25 లక్షలు, 10 వేలకుపైగా జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షలు

- మిగత 2 లో..





చర్చకు రెడీనా.. బర్నాల్ పంపనా!?



- పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధిపై బహిరంగ చర్చకు జగన్‌కు లోకేశ్ సవాల్
- ఏపీలో పెట్టుబడులు పెట్టిన ప్రముఖ సంస్థల వివరాలతో ఎక్స్‌లో పోస్టు
- ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పిల్‌లు వేసి.. మళ్లీ వాటి ఘనత తమదేనంటున్నారంటూ విమర్శలు

2

ఐటీఐ విద్యార్థులకు ఐఐటీ పట్టభద్రులతో సమాన గౌరవం ఇవ్వాలి

- నైపుణ్యంతో కూడిన కార్మిక శక్తికి ఏఐ యుగంలో పెరగనున్న ఉపాధి అవకాశాలు
- జర్మనీ ఆటోమొబైల్ పరిశ్రమలో నైపుణ్య కార్మికులకు ఇచ్చే గౌరవాన్ని ప్రస్తావించిన మంత్రి లోకేశ్

2

టౌన్ ప్లానింగ్‌లో విప్లవాత్మక సంస్కరణలు

- రియల్ ఎస్టేట్‌తోనే ఆర్థిక ప్రగతి
- క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే సంస్కరణలు
- శాఖల అనుసంధానంతో అనుమతులు సులభతరం
- పురపాలకశాఖ మంత్రి నారాయణ

6

అభివృద్ధికి అండగా నిలవండి.. కూటమి అభ్యర్థులను గెలిపించండి

- మంత్రి నిమ్మల పిలుపు

6

కొరియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల వైఖరి దారుణం

- గిరిజనుల ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవటం సరికాదు
- సరిహద్దు ప్రాంతాల్లో సమన్వయంతో వ్యవహరించాలి
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

5



పురాధీశుల 'ప్రమాణం' నేడే!

రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థల నూతన పాలకవర్గాల తొలి సమావేశాలను సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించనున్నారు. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో తొలి సమావేశాలు జరగనున్నాయి. తొలి సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన మేయర్లు, ఛైర్‌పర్సన్లు, వార్డు సభ్యులతో ఎన్నికల సంఘం అధికారులు ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

2

చర్చకు రెడీనా.. బర్నాల్ పంపనా!?

- పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధిపై బహిరంగ చర్చకు జగన్‌కు లోకేశ్ సవాల్
- ఏపీలో పెట్టుబడులు పెట్టిన ప్రముఖ సంస్థల వివరాలతో ఎక్స్‌లో పోస్టు
- ప్రాజెక్టులను అడ్డుకునేందుకు పిల్‌లు వేసి.. మళ్లీ వాటి ఘనత తమదేనంటున్నారంటూ విమర్శలు

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధి, ఉద్యోగాల కల్పనలో కూటమి ప్రభుత్వ పనితీరును, వైసీపీ హయాంలోని పరిస్థితులను పోలుస్తూ ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు.

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పలు ప్రముఖ అంతర్జాతీయ, జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులకు ముందుకొచ్చాయని లోకేశ్ పేర్కొన్నారు. గూగుల్ రూ. 1.33 లక్షల కోట్లు, ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ రూ. 1.36 లక్షల కోట్లు, బ్రూక్‌ఫీల్డ్ రూ. 1.06 లక్షల కోట్లు, రిలయన్స్ రూ. 43 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రస్తావించారు. రెన్యూ సంస్థను కూడా తన పోస్టులో పేర్కొన్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో ఇప్పటికే వేలాది ఉద్యోగాలు సృష్టించబడ్డాయని తెలిపారు. మరోవైపు వైసీపీ హయాంలో పెట్టుబడులు, అభివృద్ధికి సంబంధించిన రికార్డును ప్రశ్నిస్తూ తన పోస్టులో ఖాళీ మ్యాప్, బర్నాల్ ట్యూబ్ చిత్రాన్ని ఉంచారు. పారిశ్రామిక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు (పిల్‌లు) దాఖలు చేస్తూ, ఆ తర్వాత వాటి ఘనతను తమ ఖాతాలో వేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని లోకేశ్ ఆరోపించారు. ఇకనైనా పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధిపై చర్చకు సిద్ధం కావాలని జగన్‌కు సవాల్ విసిరారు. చర్చకు వస్తారా? లేక బర్నాల్ పంపించాలా? అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఈ పోస్టుకు 'క్రెడిట్‌చోర్ జగన్' హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు.



ఏకగ్రీవాలను ప్రోత్సహించాలి

మొదటి పేజీ తరువాయి..

అందించే విషయాన్ని ప్రజలకు వివరించాలని నేతలకు సూచించారు. గతంలో ఏకగ్రీవ పంచాయతీలకు కనిష్ఠంగా రూ. 5 లక్షలు, గరిష్ఠంగా రూ. 20 లక్షల వరకు ప్రోత్సాహకం ఉండేదని, ప్రస్తుతం కనిష్ఠ మొత్తాన్ని రూ. 15 లక్షలకు, గరిష్ఠ మొత్తాన్ని రూ. 50 లక్షలకు పెంచిన విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నిధులు గ్రామాలకు అందితే మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడతాయని వివరించారు.

గ్రామస్థాయి నేతలతో సంప్రదింపులు జరపాలి

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి గ్రామస్థాయి నాయకుల్లో ఎక్కువగా ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఒకే పార్టీలోని నాయకులు కూడా పరస్పరం పోటీ పడే పరిస్థితులు ఉంటాయని, అటువంటి వారితో ముందుగానే మాట్లాడి ఏకాభిప్రాయానికి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో వ్యక్తిగత పట్టుదలలు, రాజకీయ ఆధిపత్య పోరుకు బదులుగా సమష్టి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. పార్టీలో నేతల మధ్య పంతాలు, ఈగోలకు తావులేకుండా ఐక్యతతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో పార్టీ నాయకులతో సంప్రదింపులు జరపాలని, ఏకగ్రీవాల వల్ల గ్రామాలకు కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు. ఒకే పార్టీలోని రెండు వర్గాలు పరస్పరం పోటీ పడే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని హెచ్చరించారు. జడ్పీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో వైసీపీ పోటీ పట్ల ఆసక్తి చూపడం లేదని పేర్కొన్న సీఎం, కూటమి శ్రేణులు మాత్రం అనవసరమైన అంతర్గత పోటీలకు దిగకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజల ఐక్యతే ప్రాధాన్యంగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించుకునేలా పార్టీ నేతలు కృషి చేయాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

కొండపిలో టీడీపీ నూతన కార్యాలయ నిర్మాణం

- మంత్రి డోలా, మ్యారిటైం బోర్డు చైర్మన్ సత్య స్థల పరిశీలన



కొండపి/ ప్రకాశం (చైతన్యరథం): ప్రకాశం జిల్లా కొండపిలో టీడీపీ నూతన కార్యాలయం నిర్మాణం కోసం మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదివారం స్థల పరిశీలన చేశారు. స్థానిక టీడీపీ నాయకులతో కలిసి తెలుగుదేశం పార్టీ కార్యాలయ నిర్మాణం కోసం అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రముఖ సిద్ధాంతి జయరామిరెడ్డితో వాస్తుపరమైన అంశాలపై చర్చించారు. కొండపి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులకు నిత్యం అందుబాటులో ఉండేలా ఈ నూతన కార్యాలయాన్ని అన్ని వసతులతో నిర్మించనున్నట్టు మంత్రి స్వామి తెలిపారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయం కార్యకర్తలకు దేవాలయం లాంటిదని, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించి కార్యకర్తలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు ఐఐటీ పట్టభద్రులతో సమాన గౌరవం ఇవ్వాలి

- నైపుణ్యంతో కూడిన కార్మిక శక్తికి ఏఐ యుగంలో పెరగనున్న ఉపాధి అవకాశాలు
- జర్మనీ ఆటోమొబైల్ పరిశ్రమలో నైపుణ్య కార్మికులకు ఇచ్చే గౌరవాన్ని ప్రస్తావించిన మంత్రి నారా లోకేశ్



అమరావతి (చైతన్య రథం): ఐటీఐ విద్యార్థులకు ఐఐటీ పట్టభద్రులతో సమాన గౌరవం, గుర్తింపు లభించాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించారు. నైపుణ్య ఆధారిత పనులపట్ల సమాజంలో ఉన్న చిన్నచూపును తొలగించి, వృత్తి విద్యకు, నైపుణ్యం కలిగిన కార్మికులకు తగిన గౌరవాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రస్తావనను స్వాగతిస్తూ ఆయన ఎక్స్ (ట్విటర్) వేదికగా స్పందించారు.

కృత్రిమ మేధ (ఏఐ) ప్రాధాన్యం పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో సాంకేతిక నైపుణ్యాలు కలిగిన పారిశ్రామిక కార్మికులకు ఉపాధి అవకాశాలు, డిమాండ్ మరింత పెరుగుతాయని లోకేశ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా తయారీ రంగంలో సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేయగల నైపుణ్య కార్మికులకు భవిష్యత్తులో ఎంతో విలువ ఉంటుందని పేర్కొన్నారు.

తాను యువకుడిగా ఉన్న సమయంలో జర్మనీలోని ఆటోమొబైల్ పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్ చేసిన అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అక్కడ నైపుణ్యం కలిగిన కార్మికులకు ఇచ్చే గౌరవాన్ని ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. నైపుణ్య కార్మికులకు సమాజంలో లభించే గౌరవమే జర్మనీ అధిక నాణ్యతతో కూడిన తయారీ రంగంలో ప్రపంచ స్థాయి శక్తిగా ఎదగడానికి దోహదపడిన అంశాల్లో ఒకటని పేర్కొన్నారు. దేశంలో ఐటీఐ విద్యార్థులు, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించే వారిపై ఉన్న చిన్నచూపు తొలగిపోవాలని, నైపుణ్యంతో కూడిన పనులు చేయడంలో గర్వపడే వాతావరణం ఏర్పడాలని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. 'స్కిల్ ఇండియా' హ్యాష్‌ట్యాగ్‌తో తన అభిప్రాయాలను పంచుకున్నారు.

పురాధీశుల 'ప్రమాణం' నేడే!

- నేటి నుంచే ఐదేళ్ల పదవీ కాలం ప్రారంభం
- 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల తొలి సమావేశాలు నేడు
- మేయర్, చైర్ పర్సన్‌ల ప్రమాణ స్వీకారం.. డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో తొలి విడతలో ఎన్నికలు జరిగిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్లు, చైర్ పర్సన్‌లు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో నూతనంగా ఎన్నికైన మేయర్‌లు, చైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల తొలి సమావేశాలను సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంతకు ముందే రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ను జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం, 1994లోని సెక్షన్ 7(1)(ఏ), ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం, 1965లోని సెక్షన్ 20(1)(ఏ) ప్రకారం ఎన్నికైన సభ్యుల పదవీకాలం తొలి సమావేశానికి నిర్ణయించిన తేదీ నుంచి ఐదేళ్లపాటు ఉంటుంది. ఈ నిబంధనల ప్రకారం నవంబర్ 23వ తేదీని తొలి సమావేశాల తేదీగా నిర్ణయించారు.

రాష్ట్రంలోని విశాఖపట్నం, విజయవాడ, విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్లలో తొలి సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో కూడా అదే రోజు తొలి సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో నూతనంగా ఎన్నికైన మేయర్లు ,చైర్‌పర్సన్లు వార్డు సభ్యులతో చట్ట నిబంధనల ప్రకారం ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అనంతరం కార్పొరేషన్‌లలో డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికల ప్రక్రియను నిర్వహించనున్నారు.

అంతేకాకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ప్రకారం 13 మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్లను, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో వైస్ చైర్‌పర్సన్లను నవంబర్ 23వ తేదీన ఎన్నుకోనున్నారు. చట్ట నిబంధనల ప్రకారం డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను తొలి సమావేశంలో లేదా తొలి సమావేశం జరిగిన తేదీ నుంచి రెండు వారాల్లోపు నిర్వహించే తదుపరి సమావేశంలో నిర్వహించవచ్చు.

ఈ మేరకు సంబంధిత మున్సిపల్ కమిషనర్లు తొలి సమావేశాల నిర్వహణ, వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు ఎన్నికల ప్రాధికార సంస్థ ఆదేశించింది. సోమవారం నుంచి రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థల్లో నూతన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ప్రారంభం కానుంది.

కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

- **అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు అండగా నిలవాలి**
- **మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్‌లో యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ సుడిగాలి పర్యటన**

మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం సుడిగాలి పర్యటన నిర్వహించి కూటమి అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం చేపట్టారు. మహానాడు ప్రాంతంలోని 61వ డివిజన్‌లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి లాకా కృష్ణ యాదవ్‌తో కలిసి గొల్ల నరసింహ యాదవ్ భారీ ర్యాలీలో పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ప్రచార కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. అనంతరం డివిజన్‌లోని వివిధ వీధుల్లో ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలను కలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, డివిజన్ అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు అవకాశం కల్పించాలని ఓటర్లను అభ్యర్థించారు.

అదేవిధంగా మహానాడు ప్రాంతంలోని 60వ డివిజన్‌లో కూటమి కార్పొరేటర్ అభ్యర్థి తమ్మా వీరారెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి ప్రభుత్వ పాలన, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాలను వివరించారు. స్థానిక సంస్థల్లో ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం, ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేసే ప్రతినిధులు అవసరమని పేర్కొంటూ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈ సందర్భంగా గొల్ల నరసింహ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. పేదలు, మహిళలు, రైతులు, యువత, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అరాచకత్వం, అవినీతి, అక్రమాలతో తీవ్రంగా నష్టపోయిందని ఆయన విమర్శించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించడంలో గత ప్రభుత్వం విఫలమైందని, అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడటంతో రాష్ట్ర ప్రగతికి ఆటంకాలు ఏర్పడ్డాయని అన్నారు. ప్రజలు మార్పును కోరుకుని కూటమి ప్రభుత్వానికి అధికారం అప్పగించారని, ఆ ప్రజా తీర్పుకు అనుగుణంగా ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటోందని, అదే సమయంలో మౌలిక సదుపాయాల కల్పన,



రహదారుల అభివృద్ధి, తాగునీటి సదుపాయాలు, పట్టణాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా స్థానిక సంస్థలు పనిచేస్తాయని, కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్ అభివృద్ధి చెందాలంటే సమర్థవంతమైన ప్రజాప్రతినిధులు ఎన్నిక కావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం చూపించేందుకు కూటమి అభ్యర్థులు కృషి చేస్తారని గొల్ల నరసింహ యాదవ్ తెలిపారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే నాయకత్వానికి ఓటర్లు మద్దతు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తమ మద్దతును తెలియజేయాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఓటరును కలుసుకోవాలని, అభ్యర్థుల విజయానికి సమష్టి కృషి చేయాలని సూచించారు. కూటమి ఐక్యతే బలమని, ప్రజల మద్దతుతో స్థానిక సంస్థల్లోనూ కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో శాసనసభ్యులు ఎం.ఎం. కొండయ్య యాదవ్, నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వరరావు, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్ పర్సన్‌ల ఎన్నిక

- కూటమిలో సీట్ల పంపకాలు రారు

అమరావతి (చైతన్యరథం): పట్టణ పాలనలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సోమవారం తొలి సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లోనే మేయర్, చైర్ పర్సన్‌ల ప్రమాణ స్వీకారంతో పాటు డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్పర్సన్ల ఎన్నికలు కూడా నిర్వహించనున్నారు. ఈ పదవుల పంపకాలపై కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చింది. తెలుగుదేశం పార్టీకి 66, జనసేనకు 23, బీజేపీకి 9 డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ పదవులు దక్కనున్నాయి. దీంతో పట్టణ స్థానిక సంస్థల్లో పాలక బాధ్యతల స్వీకరణకు కూటమి పార్టీలు సిద్ధమయ్యాయి. డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్‌పర్సన్ పదవులకు టీడీపీ పోటీ చేయనున్న స్థానాలు ఇవే:

క్రసం	పట్టణ స్థానిక సంస్థ	జిల్లా
1	అనంతపురం	అనంతపురం
2	చిత్తూరు	చిత్తూరు
3	కడప	కడప
4	ఏలూరు	ఏలూరు
5	ఒంగోలు	ప్రకాశం
6	విజయవాడ	ఎన్టీఆర్
7	విజయనగరం	విజయనగరం
వైస్ ఛైర్పర్సన్లు - మున్సిపాలిటీలు & నగర పంచాయతీలు (59)		
1	అద్దంకి	ప్రకాశం
2	ఆదోని	కర్నూలు
3	ఆళ్లగడ్డ	నంద్యాల
4	అమలాపురం	డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
5	ఆత్మకూరు	నంద్యాల
6	బద్వేలు	కడప
7	చిలకలూరిపేట	పల్నాడు
8	చీమకుర్తి	ప్రకాశం
9	చీరాల	బాపట్ల
10	దర్శి	మార్కాపురం
11	డోన్	నంద్యాల
12	గిద్దలూరు	మార్కాపురం
13	గుత్తి	అనంతపురం
14	గుంతకల్లు	అనంతపురం
15	హిందూపురం	శ్రీ సత్యసాయి
16	ఇచ్ఛాపురం	శ్రీకాకుళం
17	జమ్మలమడుగు	కడప
18	కదిరి	శ్రీ సత్యసాయి
19	కళ్యాణదుర్గం	అనంతపురం
20	కనిగిరి	మార్కాపురం
21	కుప్పం	చిత్తూరు
22	మాచర్ల	పల్నాడు
23	నగరి	చిత్తూరు
24	నంద్యాల	నంద్యాల
25	నరసాపురం	పశ్చిమ గోదావరి

క్రసం	పట్టణ స్థానిక సంస్థ	జిల్లా
26	నిడదవోలు	తూర్పు గోదావరి
27	నూజివీడు	ఏలూరు
28	పెడన	కృష్ణా
29	పెద్దాపురం	కాకినాడ
30	పెనుకొండ	శ్రీ సత్యసాయి
31	పిడుగురాళ్ల	పల్నాడు
32	ప్రొద్దుటూరు	కడప
33	పులివెందుల	కడప
34	పుంగనూరు	చిత్తూరు
35	పుట్టపర్తి	శ్రీ సత్యసాయి
36	పుత్తూరు	చిత్తూరు
37	రాజంపేట	కడప
38	రాయచోటి	అన్నమయ్య
39	సాలూరు	పార్వతీపురం మన్యం
40	సామర్లకోట	కాకినాడ
41	సూళ్లూరుపేట	తిరుపతి
42	తాడిపత్రి	అనంతపురం
43	తెనాలి	గుంటూరు
44	తిరువూరు	ఎన్టీఆర్
45	తుని	కాకినాడ
46	వెంకటగిరి	తిరుపతి
47	వినుకొండ	పల్నాడు
48	యలమంచిలి	అనకాపల్లి
49	ఏలేశ్వరం	కాకినాడ
50	ఎమ్మిగనూరు	కర్నూలు
51	ఎర్రగుంట్ల	కడప
52	దాచేపల్లి	పల్నాడు
53	గూడూరు	కర్నూలు
54	గురజాల	పల్నాడు
55	కమలాపురం	కడప
56	మడకశిర	శ్రీ సత్యసాయి
57	ముమ్మిడివరం	డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ
58	నెల్లిమర్ల	విజయనగరం
59	పాలకొండ	పార్వతీపురం మన్యం

పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

- రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి



అమరావతి (చైతన్యరథం): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అన్ని వార్డుల సభ్యుల స్థానాలకు ఏకగ్రీవంగా ఎన్నికలు పూర్తయి, కేవలం సర్పంచ్ పదవికి మాత్రమే ఎన్నికలు నిర్వహించాల్సిన గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ / విలీనానికి రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి మంజూరు చేసింది. పోలీసు, పోలింగ్ సిబ్బంది నియామకం, రవాణా, ఇతర ఎన్నికల నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఇందుకు కొన్ని నిబంధనలు విధించింది.

1. విలీనం చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 650 మందికి మించరాదు.
2. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం పోలింగ్ సిబ్బందిని నియమించాలి.
3. ఒకే ప్రాంగణం లేదా ఒకే ప్రాంతంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను మాత్రమే విలీనం చేయాలి. వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న కేంద్రాలను విలీనం చేయరాదు.
4. విలీనం చేసిన పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు మార్గనిర్దేశం చేసేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలి.
5. పోలింగ్ కేంద్రాల విలీనంపై ఆయా ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించడంతో పాటు, పోటీలో ఉన్న అభ్యర్థులకు కూడా సమాచారం అందించాలి.

ఈ మేరకు రాష్ట్రంలోని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించారు.

చైతన్యరథం



గ్రామీణ పారిశుద్ధ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

- చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలకు పూర్వవైభవం

గ్రామీణ పారిశుద్ధ్యం అనేది ప్రజారోగ్యానికి పునాది. చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా, దానిని వనరుగా మలచగలిగితే గ్రామాల రూపురేఖలే మారిపోతాయి. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రారంభించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య విప్లవానికి బాటలు వేశాయి. వైసీపీ పాలనలో నిర్వహణ లోపాలతో బలహీనపడిన ఈ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మళ్లీ ప్రాధాన్యతనిస్తోంది. స్వచ్ఛ రథాలు, ఇంటింటి చెత్త సేకరణ, తడి, పొడి చెత్త వేరు చేయడం, వ్యర్థాల పునర్వినియోగం వంటి కార్యక్రమాలతో గ్రామీణ పారిశుద్ధ్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది. చెత్తను సంపదగా మార్చి, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

2014-19: పారిశుద్ధ్యంలో సరికొత్త విప్లవం

2014లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి, దానిని తడి, పొడి చెత్తగా వేరు చేసి, ఉపయోగకరమైన సంపదగా మార్చే వినూత్న విధానాన్ని అమలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9 వేల చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రారంభించింది. 30 వేల మంది గ్రీన్ అంబాసిడర్లను నియమించి, ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించే వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 14 వేల ట్రై సైకిళ్లు, ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. సేకరించిన తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువుల తయారీకి చర్యలు చేపట్టింది. గ్రామాల్లో ఇంటి ముందు వాడక నీరు నిల్వ ఉండకుండా సుమారు 4.50 లక్షల సోక్ పిట్ల నిర్మాణం చేపట్టింది. ఈ విధానం వల్ల గ్రామాల్లో చెత్త పేరుకుపోయే సమస్య తగ్గడంతో పాటు, తడి చెత్త ద్వారా సేంద్రీయ ఎరువుల తయారీకి అవకాశం ఏర్పడింది. రైతులకు ఉపయోగపడే విధంగా చెత్తను సంపదగా మార్చే వ్యవస్థ రూపుదిద్దుకుంది. పారిశుద్ధ్య నిర్వహణలో గ్రామీణ ప్రాంతాలకు ఒక కొత్త దిశను చూపించింది.

వైసీపీ పాలనలో పారిశుద్ధ్య కార్యక్రమాలకు పాతర

వైసీపీ పాలనలో గ్రామీణ పారిశుద్ధ్య వ్యవస్థ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. చెత్త నుంచి సంపదను సృష్టించాల్సిన చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. ప్రజల నుంచి నెలకు రూ.60 చొప్పున పన్ను వసూలు చేసి, ప్రజల నుంచి దోచుకున్నారు. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇంటింటి నుంచి చెత్త సేకరించే వ్యవస్థ క్రమంగా బలహీనపడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 81 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. తడి, పొడి చెత్తను వేరు చేయడంలో విఫలమయ్యారు. ఫలితంగా గతంలో ఎంతో సమర్థంగా పనిచేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. గ్రామీణ పారిశుద్ధ్యానికి ఉపయోగపడాల్సిన వ్యవస్థ నిర్వహణ లోపాలతో తన ప్రాధాన్యతను కోల్పోయింది.



కూటమి ప్రభుత్వంలో చెత్త నుంచి సంపద కేంద్రాలకు మళ్లీ ఊపిరి

2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ పారిశుద్ధ్య వ్యవస్థను పునరుద్ధరించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. చెత్త పన్ను రద్దు చేసి, గతంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తిరిగి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు, ఇంటింటి నుంచి చెత్త సేకరణ వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు చేపట్టింది.

రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉన్న సుమారు 10,800 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టింది. ప్రజల్లో చెత్త సేకరణపై అవగాహన పెంచడంతో పాటు, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే విధానాన్ని ప్రోత్సహిస్తోంది. గ్రామాల్లో రోజువారీగా సేకరించే సుమారు 1,400 టన్నుల చెత్తలో 75 శాతం వరకు సంపదగా మార్చే దిశగా కార్యక్రమాలు అమలు చేస్తోంది. తద్వారా చెత్తను సమస్యగా కాకుండా ఆదాయాన్ని సమకూర్చే వనరుగా మార్చే ప్రయత్నం చేస్తోంది.

స్వచ్ఛ రథాలతో వ్యర్థాల సేకరణ.. రూ.32 కోట్ల విలువైన సంపద

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతం చేసేందుకు స్వచ్ఛ రథాల ద్వారా వ్యర్థాల సేకరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా 16 నెలల కాలంలో సుమారు రూ.32 కోట్ల విలువైన 2.18 లక్షల టన్నుల వ్యర్థాలను సేకరించడం విశేషం. ప్లాస్టిక్, కాగితాలు, ఇనుము, వస్త్రాలు, ఇతర పునర్వినియోగ వ్యర్థాలను సేకరించి, వాటిని తిరిగి ఉపయోగపడేలా చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతోంది.

ఈ విధానం వల్ల గ్రామాల్లో చెత్త పేరుకుపోవడం తగ్గడమే కాకుండా, పునర్వినియోగ వ్యర్థాల ద్వారా ఆర్థిక విలువను సృష్టించే అవకాశం ఏర్పడుతోంది. చెత్త నుంచి సంపద.. పరిశుభ్రమైన పల్లెలు.. ఆరోగ్యకరమైన ప్రజలు.. ఇదే స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి కూటమి ప్రభుత్వ లక్ష్యం.



ఆధునిక వ్యాపార రంగానికి దిక్సూచి

- ఏఐ రెడీ ఎంబీఏ పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి నారాయణ

నెల్లూరు (చైతన్యరథం): వ్యాపార రంగంలో కృత్రిమ మేధ– ఏఐ ప్రాధాన్యతను వివరిస్తూ, నెల్లూరు జిల్లా గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కాలేజీ ఎంబీఏ డీన్ డాక్టర్ గంగినేని ధనుంజయ్, ఇండస్ట్రీ నిపుణులు విజయ్ కర్ణ సంయుక్తంగా రచించిన ఏఐ రెడీ ఎంబీఏ పుస్తకాన్ని మంత్రి ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో మేయర్ విజేత రూప్ కుమార్ యాదవ్‌తో కలిసి ఆవిష్కరించారు.

మార్కెటింగ్, ఫైనాన్స్, సప్లై చైన్, ఆపరేషన్స్ వంటి విభాగాల్లో ఏఐ వినియోగంతో వ్యాపారాలను ఎలా అభివృద్ధి చేసుకోవచ్చో ఆచరణాత్మక ఉదాహరణలతో ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించారు. ఆధునిక వ్యాపార అవసరాలకు అనుగుణంగా రూపొందిన ఈ పుస్తకం ఎంబీఏ విద్యార్థులు, యువత, వ్యాపారవేత్తలకు ఎంతో ఉపయోగకరమైన మార్గదర్శకంగా నిలుస్తుందని రచయితలను మంత్రి నారాయణ అభినందించారు.



కొఠియా గ్రామాల్లో ఒడిశా పోలీసుల వైఖరి దారుణం

- గిరిజనుల ప్రజాస్వామ్య హక్కులను అడ్డుకోవటం సరికాదు
- సరిహద్దు ప్రాంతాల్లో సమన్వయంతో వ్యవహరించాలి
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి



సాలూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ సరిహద్దుల్లో పార్వతీపురం మన్యం జిల్లాలోని కొఠియా గ్రామాల ప్రజలపై ఒడిశా ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి మండిపడ్డారు. ఇప్పటికే ఏపీ, ఒడిశా సరిహద్దుల్లోని ఈ గ్రామాలపై పోలీసుల జులుంను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.

ఆంధ్రప్రభుత్వం నిర్వహిస్తున్న సర్పంచ్ ఎన్నికలను బహిష్కరించాలని ఒడిశా పోలీసులు కొఠియా గ్రామాల ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డ శనివారం అర్ధరాత్రి ఆరుగురు గిరిజనులను ఒడిశా పోలీసులు కిడ్నాప్ చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మంత్రి సంధ్యారాణిని కొఠియా గ్రామాల ప్రజలు కలిసి.. ఆరుగురు గిరిజనులను కిడ్నాప్ చేశారంటూ ఆమె దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామాల్లో ఒడిశా పోలీసులు అణిచివేత చర్యలకు పాల్పడుతున్నారని ఆమెకు విన్నవించుకున్నారు. దీనిపై మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ సాలూరు నియోజకవర్గంలోని సరిహద్దు గిరిజన గ్రామస్తులపై ఒడిశా పోలీసులు వేధింపులు బాధాకరమని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధపడ్డ ఆరుగురు గిరిజనులను రాత్రికి రాత్రే మాయం చేసిన ఒడిశా ప్రభుత్వంపై మంత్రి సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారన్నారు. ఏ పార్టీ వారినైనా సరే వివాదాస్పద గ్రామాల గిరిజన ప్రజలను వేధింపులకు గురిచేయడం దారుణం. ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల ఒడిశా పోలీసులు వ్యవహరిస్తున్న తీరును సరికాదు. కొఠియా ప్రాంతంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 6 మందిని కొరాపుట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన హక్కు. ఆ హక్కును అడ్డుకోవడం సమంజసం కాదు. సాలూరు మండల కొఠియా ప్రజలను అకారణంగా నిర్బంధించడం, వారిని భయభ్రాంతులకు గురిచేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అదుపులోకి తీసుకున్న వారిని ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే విడుదల చేయాలని ఒడిశా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన ప్రజలు ప్రశాంతంగా జీవించేలా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో వ్యవహరించాలి. గిరిజనుల హక్కులు, స్వేచ్ఛ, ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలను, గిరిజనుల హక్కులను కాపాడే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోదని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు.

ఆళ్లగడ్డ, మైదుకూరులో రెచ్చిపోయిన వైసీపీ గుండాలు

- నామినేషన్ వేస్తున్న టీడీపీ మద్దతుదారులపై దాడి హేయం
- ఎస్ఈసీకి టీడీపీ నేతలు ఎమ్మెల్సీ వర్ల రామయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్‌బాబు ఫిర్యాదు

అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలల్లో వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే విధ్వంసాలకు పాల్పడుతున్నారని టీడీపీ నేతలు ఎమ్మెల్సీ వర్ల రామయ్య, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు గారు విమర్శించారు. క్షేత్ర స్థాయిలో ప్రజా బలం కోల్పోతున్న కారణంగానే వైసీపీ ఈ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. నంద్యాల, వైఎస్సార్ కడప, గుంటూరు జిల్లాల్లో ఆదివారం టీడీపీ నాయకులపై జరిగిన దాడులను ఖండించారు. నామినేషన్ వేయడానికి వెళ్తున్న టీడీపీ శ్రేణులను అడ్డగించి వారిపై దాడి చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు ఫిర్యాదు చేశారు.

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ అసెంబ్లీ నియోజకవర్గం, వెనిగండ్ల గ్రామంలో వైసీపీ గూండాలు టీడీపీ మద్దతుదారులపై దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ పార్టీకి చెందిన బాబులాల్, బ్రాందీన్‌ల నాయకత్వంలో సుమారు 50 మంది గుమిగూడి, టీడీపీ మద్దతుదారులపై రాళ్లు, రాడ్లతో విధ్వంసం సృష్టించారు. ఈ దాడిలో చాగలమర్రి పట్టణ టీడీపీ అధ్యక్షుడు మౌలాలి, మరో నాయకుడు హనీఫ్ తీవ్రంగా గాయపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా మైదుకూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బి.కొత్తపల్లి గ్రామంలో నామినేషన్ వేయడానికి వెళుతున్న టీడీపీ మద్దతుదారులపై వైఎస్ఆర్‌సీపీ గూండాలు దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ పార్టీకి చెందిన ముత్తూరు రఘురాం అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. అలానే గుంటూరు జిల్లాలోనూ వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గంలోని తక్కెళ్లపాడు, వెనిగండ్ల గ్రామాల్లో, నామినేషన్ పత్రాల పరిశీలన సమయంలో అల్లరులు సృష్టించారు.

పోలీసులపైనే భౌతిక దాడికి ప్రయత్నించారు. పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలోని అగతవరపాడు గ్రామంలో వైసీపీ పార్టీకి చెందిన కొందరు టీడీపీ అభ్యర్థులను బెదిరించి భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు సరైనవి కాదని.. క్షేత్రస్థాయిలో వైసీపీ పార్టీ ప్రజల మద్దతు కోల్పోతుందనే కారణంతో ఇలాంటి విధ్వంసాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. గాయపడిన టీడీపీ నాయకుల ఫోటోలను ఎస్ఈసీకి అందజేశారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు ద్వారా విజ్ఞప్తి చేశారు.



పంచాయతీల్లో పోటీ వద్దు... ఏకగ్రీవాలే మేలు

- రాజకీయాలకు అతీతంగా ఒకేమాటపై సర్పంచ్‌లను ఎన్నుకోవాలి
- కక్షలు, కార్పణ్యాలతో పల్లెల్లో చిచ్చు
- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం తరఫున రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు (చైతన్యరథం): పట్టుదలకు పోకుండా పగలు పక్కనబెట్టి రాజకీయాలకు అతీతంగా ఏకాభిప్రాయంతో సర్పంచ్‌లను ఎన్నుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో పోటీ లేకుండా సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందటంతో పాటు, కక్షలు..కార్పణ్యాలు లేకుండా అందరూ సోదరభావంతో గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశం వస్తుందన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం తరఫున జనాభాను బట్టి రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహకాలు వస్తాయన్నారు.

నెల్లూరులో ఆదివారం మీడియాతో సోమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడి మాటలు విని పంచాయతీల్లో పోటీ చేస్తే మిగిలేది కక్షలు, అప్పులేనని హితవు పలికారు. సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంలతో గెలిచామని వైసీపీ నేతలు గగ్గోలు పెట్టారు..ఇప్పుడు బ్యాలెట్లతో జరిగిన ఎన్నికల్లోనూ అంతక మించి ఫలితాలు వస్తున్నాయి. వీటిపై వైసీపీ నేతలు ఏమంటారో అన్నారు. పారదర్శకంగా ఎన్నికలు జరగబట్టే కడప, పులివెందుల ప్రాంతంలోనూ ప్రజాస్వామ్యం గెలిచింది. పులివెందుల నుంచి శ్రీకాకుళం వరకు వైసీపీ తుడిచిపెట్టుకుపోయి కూటమి క్లీన్ స్వీప్ చేసింది. 2024 ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ 94 శాతం స్ట్రైక్ రేట్ తో 175కి 164 సీట్లను గెలుచుకున్నాయి. అప్పుడు వైసీపీ నేతలు ఈవీఎంలు, ఈవీఎంలు అని గొంతు చించుకున్నారు. ఇప్పుడు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. పులివెందుల నుంచి శ్రీకాకుళం వరకు టీడీపీ, జనసేన, బీజేపీ క్లీన్ స్వీప్ చేసేశాయి. 40 ఏళ్ల తర్వాత కడప, పులివెందుల ప్రాంతంలో అత్యంత పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరిగింది. మొన్నటి ఎన్నికల వరకు అక్కడ అంతా దుర్మార్గాలే..నామినేషన్లను వేయనిచ్చేది లేదు...ప్రజలకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించే అవకాశమే ఉండేది కాదని సోమిరెడ్డి తెలిపారు.



ఏకగ్రీవం..గ్రామాలకు మేలు

ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితమైనవి..గ్రామాల్లో అందరూ కూర్చుని రాజకీయాలకు అతీతంగా సర్పంచ్ లను ఎన్నుకుంటే కచ్చితంగా ప్రోత్సహించాలి. పంచాయతీలను ఏకగ్రీవం చేసుకుంటే ప్రభుత్వం భారీగా ప్రోత్సాహకాలను ప్రకటించింది. 5 వేలు లోపు జనాభా ఉంటే రూ.15 లక్షలు, 10 వేలు లోపు జనాభా ఉంటే రూ.25 లక్షలు, 10 వేలు పైన జనాభా ఉన్న పంచాయతీలకు రూ.50 లక్షలు అందించనున్నారు. పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవమైతే వచ్చే ప్రయోజనాల గురించి ప్రజలు ఆలోచించాలి. వైసీపీ జిల్లా అధ్యక్షుడేమో ప్రతి పంచాయతీలో పోటీ ఉండాల్సిందే..పోటీ పడాల్సిందే..తన్నుకోవాల్సిందే..లక్షలు ఖర్చుపెట్టాల్సిందే...అప్పులు పాలుకావల్సిందేనని స్థానిక నాయకులకు ఆదేశాలు జారీ చేస్తున్నాడు. ప్రజలు ఆలోచించాలి. ఇలాంటి రాజకీయాలు మేం చేయలేదు..చేయం కూడా...గత పంచాయతీ ఎన్నికల్లోనూ పోటీల విషయంలో బలవంతం చేయలేదు. పార్టీ గుర్తులతో జరిగిన ఎన్నికల్లోనే పులివెందులలో సైతం వైసీపీ చేతులెత్తేసింది..ఇప్పుడు పార్టీ గుర్తులు లేకుండా జరిగే ఎన్నికల్లో మాత్రం రెచ్చగొడుతున్నారు. ఏకగ్రీవాల విషయంలో అన్ని పార్టీల నాయకులు సానుకూలంగా ఆలోచించాలని కోరుతున్నాను. పంతాలకు పోయి పోటీలు పెట్టి, లక్షలకు లక్షలు ఖర్చు పెట్టుకోవడంతో పాటు కక్షలు పెంచుకుంటే ఫలితం లేదు. దయచేసి అందరూ రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి గురించి ఆలోచించి ఏకగ్రీవాలను ప్రోత్సహించాలి. పంచాయతీలు ఏకగ్రీవం అయితే ప్రశాంత వాతావరణంలో పల్లెలను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీలతో పాటు మండల పరిషత్‌లు, జెడ్పీలకు ఒక్క రూపాయి డైవర్ట్ కాకుండా నిధులు వస్తాయి. అందరూ సానుకూల దృక్పథంతో ఆలోచించి ఏకగ్రీవాల దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి కోరారు.

దేశంలోనే తొలిసారిగా...

టౌన్ ప్లానింగ్‌లో విప్లవాత్మక సంస్కరణలు

- **రియల్ ఎస్టేట్‌తోనే ఆర్థిక ప్రగతి**
- **క్షేత్రస్థాయి పరిశీలన తర్వాతే టౌన్ ప్లానింగ్ సంస్కరణలు**
- **అన్ని శాఖల అనుసంధానంతో అనుమతులు మరింత సులభతరం**
- **పురపాలకశాఖ మంత్రి నారాయణ**



నెల్లూరు (చైతన్యరథం): టౌన్ ప్లానింగ్ రంగంలో దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని, రియల్ ఎస్టేట్ రంగాన్ని బలోపేతం చేస్తేనే రాష్ట్రం ఆర్థికంగా ఎదుగుతుందని పురపాలక. పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. భారతదేశంలో తొలిసారిగా ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టమ్ తీసుకొచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, ప్రస్తుతం తెస్తున్న 2.0 అప్‌గ్రేడ్‌తో అన్ని శాఖల అనుసంధానం 3 నుంచి 6 నెలల్లో పూర్తవుతుందని ప్రకటించారు.

నెల్లూరులో ఆదివారం వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (డబ్ల్యూఏఎల్‌టీపీ ఏపీ) సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి నారాయణ మాట్లాడుతూ క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకునేందుకు కావలిలో 100 శాతం ఇళ్ల వెరిఫికేషన్, నెల్లూరులో లేఅవుట్లు, తెనాలి సహా పలు పట్టణాల్లో పరిశీలించి ఈ సంస్కరణలు చేపట్టామని తెలిపారు. పరిశ్రమలు రావాలన్నా కనీస మౌలిక సదుపాయాలు, ఇళ్లు తప్పనిసరని సీఎం చంద్రబాబు చెప్పిన విషయాన్ని గుర్తుచేస్తూ.. రియల్ ఎస్టేటర్లు, లైసెన్స్ సర్వేయర్లు, ఇంజినీర్లతో సమన్వయం చేసుకుని ముందుకెళ్తున్నామని పేర్కొన్నారు.

గుంటూరు, విజయవాడ, నెల్లూరు ద్వారా దశలవారీగా అమలు చేసిన ఆన్‌లైన్ విధానాన్ని నేడు అనేక రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని, ప్రస్తుతం ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వక్ఫ్ బోర్డ్, ఎయిర్‌పోర్ట్, సీకోస్ట్ అథారిటీల సాఫ్ట్‌వేర్‌లను అనుసంధానించే ప్రక్రియ వేగంగా జరుగుతోందని వివరించారు. చివరగా, మీకు ఏ ఇబ్బంది ఉన్నా సచివాలయంలో తనను నేరుగా కలవవచ్చని, తప్పకుండా చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.
డబ్ల్యూఏఎల్‌టీపీఏపీ

ఈ కార్యక్రమంలో మేయర్ విజేత రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర స్థాయి నుండి డబ్ల్యూఏఎల్‌టీపీ ఏపీఅధ్యక్షుడు ఎం. ప్రసాద్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.కె. హిదయతుల్లా, సంయుక్త కార్యదర్శి ఎన్. మల్లికార్జున రెడ్డి, కోశాధికారి సి.హెచ్. శ్రీనివాస్ కుమార్, రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు పి.వి.ఎన్. మాణిక్యాల రావు హాజరయ్యారు. వీరితో పాటు నెల్లూరు అసోసియేషన్ నుండి ప్రధాన కార్యదర్శి కె. రవి కుమార్, ఉపాధ్యక్షుడు ఎస్.కె. అల్తాఫ్, సంయుక్త కార్యదర్శి ఇంతియాజ్ బాబు, కోశాధికారి ఎ. వెంకటేష్, మరియు ఈసీ సభ్యుడు టి.పి. చిట్టి బాబు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

అభివృద్ధికి అండగా నిలవండి....

కూటమి అభ్యర్థులను గెలిపించండి

- **మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపు**
- **తీవ్ర జ్వరంలోనూ సెలైన్ ఎక్కించుకుని మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి**



పాలకొల్లు (చైతన్యరథం): వైసీపీ ఐదేళ్లు అధికారంలో ఉన్నప్పుడే ప్రజల సమస్యలను, అభివృద్ధిని పట్టించుకోలేదని, నేడు ఆ పార్టీ నాయకులు మాయ మాటలతో ఓటడిగేందుకు వస్తే నిలదీయాలని రాష్ట్ర జలవనూర్ల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పిలుపు ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని 16 ,17, 3, 30, 31, 26, 27, 43 వార్డుల్లో మంత్రి నిమ్మల ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అధికారంలో లేని వైసీపీ, స్వతంత్ర అభ్యర్థులకు ఓటు వేస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని.. ఓటు సముద్రంలోనే వేసినట్లే అవుతుందన్నారు. మున్సిపాలిటీలో కూటమి పాలకవర్గం అధికారంలోకి వస్తే ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. వైసీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులకు అటువంటి అవకాశం ఉండదన్నారు.

నాలుగు రోజులుగా మంత్రి నిమ్మల జ్వరంతో బాధపడుతున్నా.. ఆసుపత్రిలో సెలైన్ ఎక్కించుకుని మరీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ కూటమి మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి ఆబోతుల ఉషారాణి, కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. మంత్రి అనారోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా ప్రచారం నిర్వహించడాన్ని చూసిన ప్రజలు ఆయనకు అడుగడుగునా నీరాజనాలు పలికారు. మహిళలు హారతులిచ్చి ఆశీర్వదించారు.పట్టణంలోని ప్రతి వార్డులో మంత్రి నిమ్మల పర్యటనకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పాలకొల్లు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి కూటమి అభ్యర్థులకే ఓటు వేస్తామని పలువురు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి తెలిపారు. మీరు పడుతున్న కష్టానికి మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మంత్రి ప్రచారానికి వచ్చిన సందర్భంలో తమ ప్రాంతాల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

ప్రజల సమస్యలను ఆప్యాయంగా వింటూ.. ప్రతి సమస్య పరిష్కారానికి, వార్డుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు బాధ్యత తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించే బాధ్యత తనదని, కూటమి అభ్యర్థులను గెలిపించే బాధ్యత ప్రజలదని పేర్కొన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పాలకవర్గం మున్సిపాలిటీలో ఉంటే జరుగుతున్న అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు.

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నానని మంత్రి తెలిపారు. గత రెండున్నరేళ్లలో రూ.1,275 కోట్ల నిధులు తీసుకువచ్చి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. పాలకొల్లు పట్టణంలో కోట్లాది రూపాయలతో ఏడాది పొడవునా తాగునీటి సమస్య లేకుండా విజ్జేశ్వరం నుంచి సురక్షిత తాగునీరు అందించే పనులు, శాశ్వతంగా డంపింగ్ యార్డ్ సమస్య తీరేలా పనులు జరుగుతున్నాయన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందేలా వంద పడకల ప్రభుత్వాసుపత్రిని అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నామన్నారు.

పట్టణంలో విలీన గ్రామాల్లోనూ సమగ్ర అభివృద్ధికి అధిక ప్రాధాన్యతను ఇవ్వనన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని నిధులు తీసుకువచ్చి పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించి సమగ్ర అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక వాటిని పట్టించుకోకపోవడంతో అభివృద్ధి నిలిచిపోయి సమస్యలు పెరిగిపోయాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ అధికారంలోకి వచ్చిన తాను ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చేలా పని చేస్తున్నానన్నారు.

పాలకొల్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ఆబోతుల ఉషారాణికి అవకాశం కల్పించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. పార్టీలో సుమారు 40 ఏళ్లుగా నిబద్ధతతో కష్టపడి పనిచేసిన జీవి భార్య ఉషారాణికి ఈ అవకాశం ఇచ్చామని తెలిపారు.

ధనిక వర్గాలకు కాకుండా సామాన్య కార్యకర్తగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఉన్న వ్యక్తికి చైర్‌పర్సన్ అభ్యర్థిత్వం ఇచ్చామని పేర్కొన్నారు. ఉషారాణితో పాటు కూటమి కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపిస్తే పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం నిరాటంకంగా కొనసాగుతాయని చెప్పారు. పాలకొల్లు పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల మౌలిక అవసరాలు తీర్చడమే తన బాధ్యతగా భావిస్తున్నానని, కూటమి అభ్యర్థులకు ప్రజలు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలని మంత్రి నిమ్మల రామానాయుడు కోరారు. ప్రచారంలో ఆయనతోపాటు కౌన్సిలర్ అభ్యర్థులు దొడ్డ ఏడుకొండలు, ఉన్నమట్ల కబర్ది, కలిసేట్టి అంజలి, ధనాన్ని నీలవేణి, శిడగం లక్ష్మి, కొరగింజల వరలక్ష్మి, సెట్టెం దేవి, బీర వెంకటరమణ , పెద్ద సంఖ్యలో ప్రజలు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపిస్తేనే సమగ్రాభివృద్ధి

- **మంత్రి కందుల దుర్గేష్ పిలుపు**
- **రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో మంత్రి విస్తృత ప్రచారం**
- **మంగళ హారతులతో ప్రజల ఘనస్వాగతం**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్, కార్పొరేటర్ స్థానాలకు కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపు ఇచ్చారు. నగర పాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా 12వ వార్డు కూటమి అభ్యర్థి చిక్కాల వీర వెంకటరమణ (బాబులు), 30వ వార్డు కూటమి (జనసేన) అభ్యర్థి అందనపల్లి సత్యనారాయణ, ధవళేశ్వరంలోని 20వ వార్డు కూటమి (జనసేన) అభ్యర్థి యడ్ల అశ్విని మహేష్‌కు మద్దతుగా ఆదివారం రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తనయుడు గోరంట్ల రవి కిరణ్‌తో కలిసి మంత్రి దుర్గేష్ విస్తృత స్థాయిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 26న జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమిలలోని కార్పొరేటర్ అభ్యర్థులను, మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనకు ముందు వివిధ కాలనీలలో మంత్రికి స్థానిక ప్రజలు, మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. వందలాది మంది కూటమి కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా, 12వ వార్డు అంతటా ‘జై జనసేన–జై కూటమి’ నినాదాలతో మారుమోగింది.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు క్షేత్రస్థాయిలో కూడా కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటేనే నగరంలో వేగవంతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, స్త్రీ శక్తి ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2 ద్వారా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ తదితర సూపర్ సిక్స్ హామీల అమలును తద్వారా కలిగిన లబ్ధిని వివరించారు.. ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలు అందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం



కూటమి అభ్యర్థులను గెలిపించండి

రాజాం మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థి బేరు సొజన్య లత విజయాన్ని కాంక్షిస్తూ విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, అరకు పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మజ్జి శ్రీనివాసరావు, ఏపీ తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, జనసేన నాయకులు కొరకాని రవి ఇతర కూటమి నాయకులతో కలిసి ప్రచార సభలో పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, కూటమి అభ్యర్థి శ్రీమతి బేరు సొజన్య లత విజయానికి ప్రజల మద్దతు కోరారు.

టీడీపీ నేత పాతర్ల రమేష్ పిలుపు



మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది.. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికలలో కూటమి బలపరిచిన తెలుగుదేశం మున్సిపల్ మేయర్ అభ్యర్థి పేరం ఏడుకొండల తో పాటు 49, డివిజన్ (పెనుమాక లో) తెలుగుదేశం అభ్యర్థి కళ్ళం ఇందిరాకు. తాడేపల్లి లో 55వ డివిజన్ లో పోటీ చేస్తున్నా కూటమి అభ్యర్థి కోక్కిలిగడ్డ సరళ దేవి లకు తమ పవిత్రమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్ ఓటర్లను కోరారు. పెనుమాక తాడేపల్లి లలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అలిమిల్లి కృష్ణ చౌదరి. పాతర్ల రమేష్. మహమ్మద్ ఇబ్రహీం.చాగంటిపాటి పూర్ణచంద్రరావు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మునగాల మల్లేశ్వరరావు. ఎండి నజీర్. కళ్ళం రాజశేఖర్ రెడ్డి. నాగరాజు. మహమ్మద్ నూర్ భాషా. షేక్ జానీ మేడూరి వరప్రసాద రావు శ్రీమతి అనూష శ్రీమతి మాణిక్యం దేశం కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాతర్లరమేష్ మాట్లాడుతూ మంగళగిరి అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని, మంగళగిరిలో కూడా అదే అభివృద్ధి కొనసాగుతుందని ఆయన తెలిపారు

అల్లూరును ఆదర్శవంతంగా అభివృద్ధి చేస్తా

రాష్ట్ర పురపాలక మంత్రి డాక్టర్ నారాయణ హామీ



అల్లూరు (చైతన్యరథం): అల్లూరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర మంత్రి నారాయణ స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చారు. నగర పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మండలంలోని పలు కాలనీల్లో విస్తృతంగా పర్యటించారు. టీడీపీ కూటమి చైర్మన్ అభ్యర్థి తోటకూర సునీల్ కుమార్ అదేవిధంగా కౌన్సిలర్లను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని, అల్లూరుకు వచ్చి స్థానిక సమస్యలను స్వయంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

.ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి నారాయణ, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ అబ్జర్వర్ డూండి రాకేష్‌తో కలిసి మండలంలోని చింతగుంట కాలనీ, వుడ్ హౌస్ పేట, రాయపేట ప్రాంతాల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించి, టీడీపీ కూటమి చైర్మన్ అభ్యర్థి తోటకూర సునీల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా స్థానికులకు పలు కీలక హామీలు ఇచ్చిన మంత్రి నారాయణ, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని, ఎన్నికలు పూర్తయిన 10 రోజుల్లోనే ఇళ్లకు నీటి కనెక్షన్లు ఇప్పిస్తామని, కాలనీల్లోని చిన్నపాటి అడ్డరోడ్లను నెల రోజుల్లోపు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. అలాగే శ్మశాన వాటిక మట్టి తోలకం పనులను మూడు నెలల్లో పూర్తి చేస్తామని, స్థలాలు అందుబాటులో ఉంటే అర్హులకు ఇళ్ల పట్టాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా అల్లూరుకు వచ్చినప్పుడు స్థానిక సమస్యలను పరిష్కరిస్తానని, పనుల శంకుస్థాపనలతో పాటు ప్రారంభోత్సవాలకు కూడా తానే స్వయంగా హాజరవుతానని, కూటమి అభ్యర్థికి మంచి మెజారిటీ అందిస్తే ఇచ్చిన ప్రతి మాటను వంద శాతం నిలబెట్టుకుంటానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎస్ కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఎన్నికల ప్రచారం



ఎస్ కోట (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శృంగవరపుకోట మండలం, ఎస్.కోట పంచాయతీ పరిధిలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. పట్టణంలోని 1, 2వ వార్డులలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ నెల 26వ తేదీన జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో తమ అభ్యర్థులను గెలిపించాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రచార సభలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ, ఎస్.కోట పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు బలపరిచిన నానిగిరి రావణాజి బరిలో ఉన్నారని తెలిపారు. గతంలో ఓటర్లు కోరిన విధంగా రోడ్ల నిర్మాణం, ప్రధాన సమస్యల పరిష్కారం ఆలయ నిర్మాణ వంటి హామీలను ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే తప్పకుండా నెరవేరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఓటింగ్ ప్రక్రియపై ఓటర్లకు స్పష్టతనిస్తూ ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. 26వ తేదీ ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, సర్పంచ్ అభ్యర్థి నానిగిరి రమణాజీ గుర్తు అయిన 'వంకాయ'కు ఓటు వేయాలని కోరారు. అలాగే 1వ వార్డు అభ్యర్థి పొడుగు సంతోష్ గుర్తు 'గౌను'కు, 2వ వార్డు అభ్యర్థి గొర్లి కన్నతల్లి గుర్తు 'కుక్కర్'కు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆయా వార్డుల వారీగా కేటాయించిన గుర్తులను గమనించి, సర్పంచ్ మరియు వార్డు మెంబర్ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని లలిత కుమారి ఓటర్లను కోరారు.



శ్రీకాకుళంలో ఎంపీ కలిశెట్టి ఎన్నికల ప్రచారం

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, జనసేన మంత్రి మనోహర్‌తో భేటీ

శ్రీకాకుళం (చైతన్యరథం): విజయనగరం పార్లమెంటు సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు శ్రీకాకుళం మేయర్ అభ్యర్థి డాక్టర్ దానేటి రాధారాణిని గెలిపించాలని కోరుతూ కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్రావు, ఇతర కూటమి నాయకులతో కలిసి తంగివానిపేట, విశాఖ ఏ కాలనీలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కూటమి మేయర్ అభ్యర్థి విజయానికి ప్రజల మద్దతు కోరారు. అనంతరం ఇటీవల శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కొరికాన భవానీని కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు.



చైతన్యరథం



సందడి.. సందడిగా సాగిన నామినేషన్ల పర్వం

కార్యక్రమంలో అభ్యర్థులు, శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ఎమ్మెల్యే చింతమనేని



పెదవేగి (చైతన్యరథం): దెందులూరు నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం పెదవేగి మండలంలో నామినేషన్ల పర్వం సందడిగా సాగింది. మండలంలోని పలు గ్రామాల్లో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమాలకు దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పెదవేగి సర్పంచ్ అభ్యర్థిని తాత నాగధన చంద్రిక యశ్వంత్, కూచింపూడి సర్పంచ్ అభ్యర్థి గిత్త రత్నం సత్యనారాయణ, బీ సింగవరం సర్పంచ్ అభ్యర్థి మొరగాని వెంకటేశ్వరరావు బాపిరాజుగూడెం సర్పంచ్ అభ్యర్థిని బొప్పన పద్మశ్రీ సహా పలు గ్రామాల్లో అభ్యర్థుల నామినేషన్ దాఖలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా పాల్గొని వారిలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో అభ్యర్థుల వ్యక్తిగత అనుభవం, స్థాయి, స్థోమత వంటి ఇతర విషయాల కన్నా, ఎన్డీయే కూటమి బలపరిచిన అభ్యర్థులుగానే ప్రతి ఒక్కరినీ పరిగణించి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో వారి విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి సుపరిపాలనకు మద్దతుగా గ్రామ ప్రజలంతా కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నామినేషన్ కార్యక్రమాలకు విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారిని అభ్యర్థులు, స్థానిక కూటమి నాయకులు శాలువాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.



విజేతలకు ఎంపీ పుట్టా అభినందనలు

ఏలూరు (చైతన్యరథం): నగరపాలక సంస్థకు నూతనంగా ఎన్నికైన పలువురు కార్పొరేటర్లు ఆదివారం ఉదయం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు... ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేసారు... అదేవిధంగా నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు సైతం ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో ఎంపీ కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు... నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులందరికీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

సాయి నవ్య శ్రీకి పోలవరం నేతల అభినందనలు

ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన చింతమనేని సాయి నవ్య శ్రీని పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో నియోజకవర్గ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీలు, ఎంపీపీలు, మండల పార్టీ అధ్యక్షులు ఇతర ప్రజా ప్రతినిధులు సాయి నవ్య శ్రీకి శాలువా కప్పి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్‌ని కూడా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి, నియోజకవర్గ అభివృద్ధి పార్టీ బలోపేతంపై వారితో చర్చించారు.



గోదావరి పుష్కరాల పనుల్లో రహదారులకు మోక్షం



కొవ్వూరు (చైతన్యరథం): వచ్చే ఏడాది జూన్‌లో జరిగే గోదావరి పుష్కరాలకు తరలి వచ్చే భక్తుల కోసం సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ముందస్తు చర్యలకు ఉపక్రమిం చింది. శాఖలవారీగా కోట్లలో ప్రతిపాదనలు ప్రభు త్వానికి చేరాయి. దశలు వారీగా రోడ్లు, భవనాల శాఖ పనులకు ని?ధులు మంజూరు ఉత్తర్వులు వస్తున్నాయి. జిల్లాలో కీలకమైన మూడు రహదారు లను భక్తుల రాకపోకలకు అనువుగా తీర్చిదిద్దేందకు రూ. 11.72 కోట్ల ని??ధులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో రాష్ట్ర రహదారులతో కీలకమైన పుష్కర ఘాట్లకు వెళ్లే రోడ్లను అనుసంధానం చేయడంతోపాటు, విస్తరణకు చర్యలు తీసుకోనున్నా రు. ఏలూరు జిల్లాకు ఐదారు లక్షలకు పైగా భక్తులు వస్తార న్న అంచనాలు ఉన్నాయి. దీనికి తగట్టుగా మూడు రోడ్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టను న్నారు. పట్టిసీమ నుంచి పోలవరం వైపుగా పుష్కర ఘాట్లకు వెళ్లే అఖండ గోదావరి కుడి ప్రధాన రోడ్డు విస్తరణ, అభివృద్ధికి రూ.రెండు కోట్లు విలువైన పనులకు టెండర్లు పిలవగా స్వాతి కన్‌స్ట్రక్షన్స్ తణుకు సంస్థ టెండరు దక్కించుకుంది. మరోవైపు చేబ్రోలు నుంచి ఉండి వైపు వెళ్లే రాష్ట్ర రోడ్డును రూ.4.72 కోట్లతో అభివృద్ధి చేయడానికి టెండర్లు ఆహ్వానించగా కేపీపీ ఇన్‌ఫ్రా సంస్థ టెండరు దక్కిం చుకుంది. ఇక కీలకమైన భీమడోలు, కామవరపు కోటకు ప్రధాన రహదారిని రూ.ఐదు కోట్లతో చేపట్టే పనులకు టెండర్లు పిలిచారు. డిసెంబరు 3వ తేదీ నాటికి టెండర్ ప్రక్రియ కొలిక్కి వస్తుంది. దీంతో మూడు పనులకు అగ్రిమెంట్‌లు పూర్తి చేసి పనులు ప్రారంభించడానికి అధికారులు గ్రీన్‌సిగ్నల్ ఇస్తారు. డిసెంబరు మూడో వారంలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పోలవరం, రాజమండ్రి, తాళ్లపూడి ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు, మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు ఆర్‌అండ్ బీ అధికారులు, ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

జోరుగా నామినేషన్ల పర్వం

తిరుపతి (చైతన్యరథం): పల్లెపోరులో భాగంగా మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఊపందుకుంది. ఎనిమిది మండలాల పరిధిలో 182 సర్పంచ్, 167 వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 23వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుంది. 24న పరిశీలిస్తారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆర్డీవోల వద్ద అప్పీళ్ళు, 26న అప్పీళ్ల పరిష్కారం, 27న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ తరువాత బరిలోని అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ జరుగుతుంది. డిసెంబరు 2వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్ల లెక్కిస్తారు. మూడో విడతలో గంగాధరనెల్లూరు డివిజన్‌లోని జీడీ నెల్లూరు, పెనుమూరు, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, కార్వేటినగరం, పాలసముద్రం, చిత్తూరు డివిజన్‌లోని చిత్తూరు, గుడిపాల మండలాల పరిధిలో జరగనున్న ఎన్నికలకు 44 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. మొత్తం ఓటర్లు 2,64, 509 మంది ఉండగా వీరిలో మహిళలు 1,33,824 మంది, పురుషులు 1,30,685 మంది ఉన్నారు. వెదురుకుప్పం మండలంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు తక్కువగా ఉండగా మిగిలిన ఏడు మండలాల్లో మహిళా ఓటర్లే అధికారంగా ఉన్నారు.

గెలుపే పరమావధిగా పని చేయాలి

శ్రేణులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పిలుపు

పెదపాడు (చైతన్యరథం): "రాష్ట్రంతో పాటు గ్రామస్థాయిలో కూడా అభివృద్ధి సంక్షేమ పాలన అందిస్తున్న కూటమికి మాత్రమే ప్రజల నుంచి ఓటు అడిగే నైతిక హక్కు ఉంది, కూటమి బలపరిచిన సర్పంచ్ మరియు వార్డు సభ్యుల గెలుపు బాధ్యత స్థానిక కూటమి నాయకులదేనని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పేర్కొన్నారు. 2ఏళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో అందించిన అభివృద్ధి సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అటు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అయినా, నిన్నటి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో సైతం కూటమి ప్రభుత్వానికే ప్రజలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు – రాబోయే గ్రామ స్థాయి ఎన్నికల్లో సైతం కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకంసూచించారు. పెదపాడు మండలం వట్లూరులో జరిగిన కూటమి సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని శ్రేణులకు దిశా నిర్దేశం చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఈ సమావేశంలో జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉప్పలపాటి రామ్ ప్రసాద్, పెదపాడు వీర్రా గుత్తా అనిల్, బిజెపి జిల్లా అధ్యక్షులు, జెడ్పీటీసీ విక్రమ్ కిషోర్, జనసేన నాయకులు ఎంపీటీసీ కల్కి రమేష్, సహా పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి ఎంపిటిసిలు, కూటమి నాయకులు, అభ్యర్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు..



గూడవల్లి సర్పంచ్‌గా నిఖిల్ ఏకగ్రీవ ఎన్నిక

గ్రామాభివృద్ధికి కృషి చేయాలని విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపు



విజయవాడ రూరల్ (చైతన్యరథం): మండలం గూడవల్లి గ్రామపంచాయతీ నూతన సర్పంచ్‌గా నెరుసు నీల మణిఈశ్వరరావు (నిఖిల్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామపంచాయతీలో మొత్తం 14 వార్డులకు గాను 11 వార్డుల సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం విజయవాడలోని కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును నూతన సర్పంచ్ నిఖిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. సర్పంచ్ పదవిని బాధ్యతగా స్వీకరించి, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

కూటమి పాలనలోనే తాడిగడప అభివృద్ధి సాధ్యం

పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పిలుపు

పెనమలూరు (చైతన్యరథం): తాడిగడప మున్సిపాలిటీ 13వ వార్డులో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడిగడప మున్సిపాలిటీ 13వ వార్డులో కూటమి కౌన్సిలర్ అభ్యర్థి సరిహద్దు విజయ రాజేశ్వరి చైర్మన్ అభ్యర్థి పీతా గోపిచంద్ విజయాన్ని కాంక్షిస్తూ పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ప్రజలు, వ్యాపారులను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతు కోరారు, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, తాడిగడప మున్సిపాలిటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమికి మరోసారి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలోనే రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేసిందని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలకు సైతం అభివృద్ధి ఫలాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిని కొనసాగించాలంటే కూటమికి ప్రజల అండ అవసరమన్నారు. మాటలతో మభ్యపెట్టే వారికి కాకుండా, చేతల్లో అభివృద్ధి చేసి చూపించే నాయకత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలి అని పిలుపునిచ్చారు. చైర్మన్ అభ్యర్థి పీతా గోపిచంద్‌తో పాటు 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి సరిహద్దు విజయ రాజేశ్వరిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయోత్సాహంతో ప్రచారాన్ని ముందుకు నడిపించారు.





ప్రజలకు నాణ్యమైన వైద్యం అదే కూటమి ప్రభుత్వం ధ్యేయం

ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు వెల్లడి

ప్రత్తిపాడు (చైతన్యరథం): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేసే దిశగా గుంటూరు రూరల్ మండలం, లాల్ పురం గ్రామంలో పీఎంగ్రాంట్ రూ.55 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (విలేజ్ హెల్త్ క్లినిక్) ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్‌బూర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శాసనసభ్యుడు డాక్టర్ బూర్ల మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలనే ఆశయంతో ప్రధానమంత్రి అభిమ్‌నిధులు రూ.55 లక్షల వ్యయంతో ఈ నిర్మాణం జరిగిందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, కింద పేదలు సామాన్య ప్రజలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామస్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించేందుకు ఈ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామ ప్రజలతో పాటు పరిసర ప్రాంతా ప్రజలకు కూడా ప్రాథమిక వైద్యం, ఆరోగ్య పరీక్షల, అవసరమైన మందుల పంపిణీ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, గర్భిణీలు, బాలింతలు చిన్నారులు, వృద్ధులకు అవసరమైన ఆరోగ్య సేవలో మరింత సులభంగా అందుబాటులోకి రానున్నాయని, అంతేకాకుండా ఈ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రజలకు భరోసాగా నిలుస్తుందని, రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా నూతన ఆరోగ్య కేంద్రాన్ని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కొర్రపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర రైతు మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి వెంకటేశ్వరరావు, గుంటూరు రూరల్ మండలం పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి లీలా మల్లేశ్వరరావు, గుంటూరు రూరల్ మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గంధం సురేష్, కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కూటమిలో సామాన్యుడు ఏడుకొండలుకు సముచిత స్థానం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్



మంగళగిరి (చైతన్యరథం): సామాన్య కుటుంబం నుంచి వచ్చిన గిరిజన సామాజిక వర్గానికి చెందిన ఏడుకొండలుకు మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించడం తెలుగుదేశం పార్టీ సామాజిక న్యాయానికి, సాధారణ కార్యకర్తలకు ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనమని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఆయన విస్తృతంగా పర్యటించి, మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏడుకొండలును ఆయన నివాసంలో కలిసి అభినందించారు. అనంతరం పలు డివిజన్లలో పార్టీ అభ్యర్థులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గొల్ల నరసింహ యాదవ్ మాట్లాడుతూ 'కార్యకర్తే అధినేత' అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ, మంత్రి నారా లోకేష్ తన సొంత నియోజకవర్గంలో సామాన్య కుటుంబానికి చెందిన ఎన్టీ అభ్యర్థి ఏడుకొండలుకు మేయర్‌గా పోటీ చేసే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఆ వారసత్వాన్ని కొనసాగిస్తూ అమరావతి రాజధాని ప్రాంతంలోని మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా సామాన్య కుటుంబానికి చెందిన ఏడుకొండలును ఎంపిక చేయడం వెనుకబడిన వర్గాల్లో ఆనందం కలిగించిందని పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలోనూ తెలుగుదేశం పార్టీ సామాన్య కుటుంబాలకు చెందిన నాయకులకు ఉన్నత రాజకీయ పదవులు కల్పించిన చరిత్ర ఉందని గుర్తుచేశారు. ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు చూపిన సామాజిక న్యాయ మార్గంలో నారా లోకేష్ కూడా ముందుకు సాగుతూ అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పిస్తున్నారని అన్నారు. ఏడుకొండలుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లకు బడుగు, బలహీన వర్గాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నవులూరు 41వ డివిజన్, ద్వారకానగర్ 17వ డివిజన్, కాజ 32వ డివిజన్లలో గొల్ల నరసింహ యాదవ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రజలను కలిసి ఏడుకొండలుకు మద్దతు ఇవ్వాలని కోరారు. మేయర్ అభ్యర్థిగా ఏడుకొండలుకు అవకాశం కల్పించిన నేపథ్యంలో ఆయనకు అండగా నిలిచి, ఓటు వేసి గెలిపించాలని నగరపాలక సంస్థ పరిధిలోని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



నేను మాటిస్తే తప్పే పసక్కి లేదు

ఎన్నికల ప్రచారంలో పురపాలక మంత్రి నారాయణ



కావలి (చైతన్యరథం): రాష్ట్ర వ్యాప్తంగా 23 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతున్నాయి..వాటిలో అల్లూరు ఒకటని పురపాలక శాఖామంత్రి నారాయణ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఎంపీ వేమిరెడ్డి కావలికి అల్లూరుకు తాను వచ్చామన్నారు. ఈ సమయం లో న్యూట్రల్‌గా ఉన్నవారిని మనం మార్చుకోవాలని సూచించారు. ఇప్పటికే అల్లూరు అభివృద్ధికి 47 కోట్లు మంజూరు చేశామని గుర్తు చేశారు. చిన్న పంచాయతీ అయినప్పటికీ కోట్ల రూపాయలు మంజూరు చేశామన్నారు. అల్లూరు ను నెల్లూరు నగర కార్పొరేషన్ కు తగ్గకుండా అభివృద్ధి చేస్తామన్నారు. 2028 జూన్ కు నెల్లూరు ను దేశం లోనే ప్రథమ స్థానంలో నిలుపుతామని హామీ ఇచ్చారు. అల్లూరు కు నెలకు ఒకసారి కచ్చితంగా వస్తానని వెల్లడించారు.

తాను, ఎంపీ వేమిరెడ్డి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఇలా ఎవరో ఒకరు వస్తూ ఉంటామని ప్రకటించారు. నెల్లూరు లో 72 డివిజన్లుతో అల్లూరును కలుపుకుని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రచారంలో అన్ని వర్గాలు, సామాజిక వర్గాలు ను అందరిని కలుపుకుని ముందుకు వెళతానన్నారు.

తాను మాట చెబితే తప్పననన్నారు.

ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26 న అల్లూరు నగర పంచాయతీకి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి కూటమి పార్టీ శ్రేణులు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తక్కువ టైమ్ ఉన్నప్పటికీ అందరం కష్టపడి ఎన్నికలు నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు.

మంత్రి నారాయణ అల్లూరు కు రావడం చాలా మంచి పరిణామమన్నారు.

అల్లూరుకు మంచి రోజులు వచ్చాయన్నారు.

అల్లూరు నగర పంచాయతీ అభివృద్ధికి 47 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. అల్లూరులో కూటమిని గెలిపించి మంత్రికి కానుకగా ఇద్దామని ప్రకటించారు. మంత్రి నారాయణ, బీద రవిచంద్ర ఇద్దరూ అల్లూరు విజయంను బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కావలి మున్సిపల్‌తో పాటు పంచాయతీ ఎన్నికలు ఉన్నందువల్ల కావలి బాధ్యత నాది అయితే అల్లూరు బాధ్యత మంత్రి బీద తీసుకుంటారన్నారు.

విజ్ఞతతో పనిచేసేవారికి ఓటెయ్యండి

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపు



కందుకూరు (చైతన్యరథం): మున్సిపాలిటీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఆదివారం ఉదయం, పట్టణంలోని 9 మరియు 10 వార్డుల్లో, అభ్యర్థులతో కలిసి ప్రచారం నిర్వహించారు.వికృరాలపేట రోడ్డుకు రెండువైపుల ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. చైర్మన్ అభ్యర్థి పిడికిటి వెంకటేశ్వర్లు, 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి షేక్ సైదాబాను, 10వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి షేక్ మహబూబ్ బాషా (రూబీ) లను గెలిపించాలని కోరారు. ప్రచారం మధ్యలో మహమ్మదీయ మసీదులో పార్టీ నేతలతో కలిసి ఎమ్మెల్యే నాగేశ్వరరావు దువా చేశారు. చర్చిలోనూ ప్రార్థనలు చేశారు. వైసిపి కుట్రలవల్ల ఇన్నేళ్లుగా మున్సిపాలిటీకి ఎన్నికలు జరగలేదని, అడ్డంకులన్నీ తొలగించి తాము ఎన్నికలు జరిపిస్తున్నామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, చైర్మన్ అభ్యర్థి పిడికిటి వెంకటేశ్వర్లును ఆయా వార్డుల నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రచారంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వలేటివారిపాలెం జడ్పిటిసి కోరుకొండ అంజిబాబు, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ బాషా, నాయబ్ రసూల్, గౌస్ బాషా, ఖాదర్ బాషా, షేక్ ఫిరోజ్, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.



రెడ్డెప్పగారి దంపతులతో సుగవాసి ప్రసాద్ బాబు భేటీ

కడప (చైతన్యరథం): పట్టణంలో టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే మాదవి రెడ్డిని అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు రెడ్డి , మాధవి రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



ఘనంగా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు

కోవూరు (చైతన్యరథం): శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి జన్మదిన సందర్భంగా, ఈరోజు నెల్లూరు లోని వి పీ ఆర్ కార్యాలయంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి గారి సమక్షంలో లో జరిగిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు లో పాల్గొని ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసిన నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర రెడ్డి. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నెల్లూరు పార్లమెంట్ ఐ టిడిపి అధ్యక్షుడు ఎస్ కే రసూల్,సంస్కృతిక విభాగం అధ్యక్షుడు దోర్నాల హరిబాబు తదితరులు కూడా ప్రశాంతి రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.



ఘనంగా ముస్లింల ఆత్మీయ సమావేశం

ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తో పాటు పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

కావలి (చైతన్యరథం): కావలిలో ముస్లింల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యే కావలి అభివృద్ధికి కష్టపడుతున్నారని కితాబిచ్చారు. కావలిలో 450 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశారని వివరించారు. మరో 450 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉన్నందువల్ల రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. కూటమిలో బీజేపీ పార్టీ చైర్మన్ అభ్యర్థి భరత్ కుమార్ ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సభా కార్యక్రమం నిర్వహించిన ఈ షాదీ మంజీల్ ను సొంత నిధులతో నెల్లూరులో ఉన్న షాదీ మంజిల్ తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. డిసెంబర్లో జరిగే జిల్లాస్థాయి ఇస్తిమాకు సహాయం చేస్తా...జిల్లా కలెక్టర్‌తో చర్చించికోవూరు షుగర్ ఫ్యాక్టరీని ముస్లింలకు ఉపయోగపడేలా చేస్తానన్నారు. ముస్లింలు అత్యంత నమ్మకమైన వ్యక్తులు...త్వరలో బీపీసీఎల్ కంపెనీకి పునాది వేయనున్నాం..100 ఎకరాల్లో స్కిల్ డెవలప్మెంట్‌తో పాటు యువత ఉద్యోగ అవకాశం కోసం ఎన్నో రాబోతున్నాయన్నారు.



శ్రీశైలంలో శోభాయమానంగా కార్తీక మాసోత్సవాలు



శ్రీశైల క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు తెల్లవారుజామున అర్చకులు సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉభయ దేవాలయాల్లో భక్తులు ఆదిదంపతులను అలంకార దర్శనాలు చేసుకుని తీర్థప్రసాదాలు తీసుకున్నారు. కార్తీక మాసంలో వచ్చే క్షీరాబ్ధి ద్వాదశి రోజున సాయంత్రం తులసీదేవి ప్రత్యేక పూజలను మహిళలు శాస్త్రోక్తంగా నిర్వహించుకుని సుమంగళిగా ఆయురారోగ్యాలతో బాసిల్లాలని అమ్మవారిని కాంక్షిస్తూ తాంబూలాలు ఇచ్చుకుంటారని దేవస్థానం ఆస్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు తెలిపారు. ఆలయ మాడవీధి శివాజీ గోపురం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉసిరి తులసి మొక్కలకు భక్తులు ప్రత్యేక పూజలు చేసుకుని కార్తీక దీపాలు వెలిగించారు.



వేమూరు మండలం అబ్బనగూడవల్లి గ్రామంలో శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



వైసీపీ వైఖరి విడ్డూరంగా ఉంది

కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి విమర్శ

కడప (చైతన్యరథం): నగరంలోని కమలాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కడప జడ్పీ చైర్మన్ పదవిని తమ తండ్రి పుత్తా నరసింహ రెడ్డికి కేటాయించడం హర్షణీయమన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తూ ముందుకు వెళ్తోందన్నారు. 40 శాతం వరకు బలహీన వర్గాలకు సీట్లు కేటాయించారన్నారు. ఎన్నికలు జరుగుతున్నప్పటికీ తుపానును కూడా సమర్థవంతంగా ఎదురుకున్నామన్నారు. సీఎం చంద్రబాబు విపత్తులు ఎదుర్కోవడంలో ముందస్తు ప్రణాళికతో వ్యవహరిస్తారన్నారు. మేయర్ ఎన్నికను ప్రత్యక్షంగా తెచ్చిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని నమ్మారని వెల్లడించారు. వైసీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు. ఈవీఎంలలో మోసం అన్నారు...ఇప్పుడు బ్యాలెట్‌లలో కూటమి ప్రభంజనం కొనసాగిందన్నారు. వైసీపీ కాలంలో రిగ్గింగ్‌లు ఎకగ్రీవాలు...ప్రస్తుత ప్రభుత్వంలో ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. పంచాయతీలలో ఏకగ్రీవాలు రావడం వల్ల అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ప్రజలు గెలిపించాలని కోరారు. ప్రజలు కూటమి కు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డితో తమకు ఎటువంటి విబేధాలు లేవన్నారు. పులివెందులలో 40 ఏళ్ల తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణం లో ఎన్నికలు జరిగాయన్నారు. వైసీపీ డ్రామాలు ఆపాలన్నారు. దాడులు చేయించుకుని మళ్ళీ కూటమి పై వైసీపీ ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.



బ్యాలెట్లయినా, ఈవీఎంలైనా కూటమితోనే జనం

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి శ్రీరామ్

రాప్తాడు (చైతన్యరథం): 2024ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధిస్తే ఈవీఎంలంటూ విమర్శలు చేశారని.. ఇప్పుడు బ్యాలెట్ ద్వారా కూడా వైసీపీకి గట్టి దెబ్బ కొట్టారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, సత్యసాయి జిల్లా జడ్పీ చైర్మన్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. రామగిరి మండలం వెంకటాపురంలోని తమ నివాసంలో వారు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రక విజయాలు, రెండున్నరేళ్ల సుపరిపాలన, సామాజిక న్యాయం, గ్రామ పంచాయతీ ఎన్నికల గురించి వివరించారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించిన ప్రజలు, ఇటీవల జరిగిన కార్పొరేషన్, మున్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బ్యాలెట్ల ద్వారా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు పట్టం కట్టారని అన్నారు. గత వైసీపీ హయాంలో రిగ్గింగ్‌లు, దాడులు, దౌర్జన్యాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మండిపడ్డారు. నేడు కూటమి ప్రభుత్వంలో అత్యంత ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయని, 40ఏళ్ల తర్వాత పులివెందుల ప్రజలు సైతం తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన ఏకపక్ష విజయాలు ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి ప్రజలు స్వచ్ఛందంగా కూటమికి అండగా నిలిచారని, రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ రాప్తాడులో ప్రతి పంచాయతీని క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు తగ్గించడం వల్ల దాదాపు 16,800 మంది బీసీ నాయకులు రాజకీయ ప్రాతినిధ్యం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కృషి చేస్తే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని, అయినప్పటికీ ఇచ్చిన మాటకు కట్టుబడి పార్టీ పరంగా 40 శాతం రిజర్వేషన్లు కల్పించి బడుగు, బలహీన వర్గాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేశారు. జడ్పీ చైర్మన్ శ్రీరామ్ మాట్లాడుతూ.. ధర్మవరం నియోజకవర్గంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు రికార్డు స్థాయి మెజారిటీతో చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం, అలాగే ధర్మవరం నియోజకవర్గంలో నాలుగు ఎంపీపీ స్థానాలు కైవశం చేసుకోవడంతో పాటు ధర్మవరం రూరల్, బత్తలపల్లి మండలాల్లో సాధించిన జడ్పీటీసీ విజయాలు క్యాడర్ సమష్టి కృషికి నిదర్శనమన్నారు. పార్టీ అధిష్టానం, జిల్లా ప్రజా ప్రతినిధుల సంపూర్ణ సహకారంతో శ్రీ సత్యసాయి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం తనపై మరింత బాధ్యతను పెంచిందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ జిల్లాలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక సంస్థలు కలిసి పనిచేసే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్' ద్వారానే సంక్షేమ పథకాలు అట్టడుగు స్థాయికి చేరుతాయన్నారు. అలా ఉంటేనే అభివృద్ధి పరుగులు పెడుతుందని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఒకే ప్రభుత్వం ఉంటే నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వేగంగా జరుగుతుందని వివరించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు, సమాన అవకాశాలు అందించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన పీ4 విధానం సత్ఫలితాలను ఇస్తోందని తెలిపారు. ఇటీవల సంభవించిన రెండు భారీ తుఫానులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వ యంత్రాంగం తుఫాను కంటే వేగంగా స్పందించి సమర్థవంతంగా ఎదుర్కొందన్నారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఎల్ నినో తీవ్రత ఉన్నా సమర్థ సాగునీటి యాజమాన్యంతో రైతులను ఆదుకున్నామన్నారు. మేయర్లు, మున్సిల్ చైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని ప్రవేశపెట్టి ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు ఇదే ఐక్యత, సమన్వయంతో పనిచేసి రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి బలపరిచిన అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల పరిధిలోని ప్రతి గ్రామాన్ని ప్రగతి బాటలో నడిపించేందుకు తాము ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు.







తానా ఆధ్వర్యంలో 'థ్యాంక్స్ గివింగ్'



వందలాది కుటుంబాలకు సాయం



అమెరికా: థ్యాంక్స్ గివింగ్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) న్యూజెర్సీ బృందం సేవా కార్యక్రమం నిర్వహించింది. శనివారం ఎడిసన్‌లోని 'హ్యాండ్స్ ఆఫ్ హోప్' కేంద్రంలో వందలాది స్థానిక కుటుంబాలకు ఆహారం, నిత్యావసర సరుకులను పంపిణీ చేసింది. అమెరికన్ సంప్రదాయం ప్రకారం కుటుంబ సభ్యులంతా కలిసి థ్యాంక్స్‌గివింగ్ విందు చేసుకునేందుకు వీలుగా ఆ విందులో ప్రధాన వంటకమైన టర్కీతో పాటు చికెన్, నిత్యావసర సరుకులను అందజేశారు. ఒక్కో ఆహార కిట్ విలువ సుమారు 100 డాలర్లు. కార్యక్రమానికి వచ్చిన వారికి వేడి భోజనాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిసన్ హైస్కూల్, సౌత్ బ్రన్స్‌విక్ హైస్కూల్‌లకు చెందిన సుమారు 60 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఆహార కిట్లు, భోజనాల పంపిణీలో సహకరించారు. తానా యువ వాలంటీర్లు అనిత్ రాంపురం, వంశీచంద్ నరేపలేపు విద్యార్థులను సమన్వయం చేశారు. తానా న్యూజెర్సీ బృందం స్థానిక ప్రజలకు అండగా నిలిచేందుకు అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. విద్యార్థులకు బ్యాక్‌ప్యాక్‌లు, పాఠశాల సామగ్రి అందించడంతో పాటు ఆహార సహాయం అవసరమైన కుటుంబాలకు నిత్యావసర సరుకులు, భోజనాలను పంపిణీ చేస్తోంది. స్థానిక సంఘాలు నిర్వహించే కార్యక్రమాల్లోనూ తానా వాలంటీర్లు పాల్గొని సహకరిస్తున్నారు. స్థానిక ప్రజలకు తానా అందిస్తున్న సేవలను ఎడిసన్, న్యూజెర్సీ రాష్ట్ర నాయకులు ప్రశంసించారు.

ఈ కార్యక్రమ నిర్వహణలో తానా కోశాధికారి రాజా కాసుకుర్తి, న్యూజెర్సీ ప్రాంతీయ ప్రతినిధి సుధీర్ చంద్ నరేపలుపు, యువజన సమన్వయకర్త శ్రీనివాస్ చెరుకూరి, తానా ఫౌండేషన్ కోశాధికారి శ్రీనివాస్ ఒరుగంటి, ఫౌండేషన్ ట్రస్టీ సతీష్ మేక సహకరించారు. ప్రవీణ్ రెడ్డి కల్వకొల్లు, రవి మాచర్ల కార్యక్రమ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. సుధీర్ రాంపురం, హరీష్ కోయ, సుందర్ గోపీనాథ్, సతీష్ మాక, మూర్తి వాలంటీర్లుగా పాల్గొని పంపిణీ కార్యక్రమంలో సహకరించారు. థ్యాంక్స్‌గివింగ్ ఆహార పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తానా న్యూజెర్సీ బృందాన్ని తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ లావు అభినందించారు.



సంక్రాంతి ఇండియన్ కిచెన్ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ నిమ్మగడ్డ (నిమ్స్)కు

'అవుట్ స్టాండింగ్ జార్జియా సిటిజన్' గౌరవం





అట్లాంటా: సంక్రాంతి ఇండియన్ కిచెన్ వ్యవస్థాపకుడు శ్రీనివాస్ నిమ్మగడ్డ (నిమ్స్)కు అత్యుత్తమ గౌరవం దక్కింది. జార్జియా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ బ్రాడ్ రాఫెన్స్ పర్జర్... ఆయనను 'అవుట్ స్టాండింగ్ జార్జియా సిటిజన్'గా ప్రకటించారు. జార్జియా స్టేట్ క్యాపిటల్‌లో సెక్రెటరీ చేతులమీదుగా ఆ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. అమెరికా అంతటా...ప్రపంచ వ్యాప్తంగా జార్జియా రాష్ట్రానికి గుడ్‌విల్ అంబాసిడర్‌గా నిమ్మగడ్డను గుర్తించారు. ఈ గౌరవంపై నిమ్మగడ్డ స్పందిస్తూ ఈ గుర్తింపు నాకు ఎంతో విలువైనది" అని ఆనందం వ్యక్తం చేశారు. నిమ్మగడ్డ 2001లో కనెక్టికట్‌లోని తన ఇంటి బేస్‌మెంట్‌లో తొలి సంస్థ వెన్సాయ్ టెక్నాలజీస్‌ను ప్రారంభించారు. దాన్ని భారత్, దుబాయ్, ఖతార్‌లలో కార్యాలయాలు కలిగిన బహుళజాతి ఐటీ సంస్థగా తీర్చిదిద్దారు. 2018లో తొలి సంక్రాంతిని ప్రారంభించి గత ఐదేళ్లుగా ఒకే ఆలోచనతో సంక్రాంతి ఇండియన్ కిచెన్‌ను నిర్వహిస్తున్నారు. అసలైన భారతీయ రుచులను తాజాగా వేగంగా అమెరికన్లకు అందిస్తున్నారు. మెక్సికన్ ఆహారానికి చిపోటిల్, మెడిటరేనియన్ ఆహారానికి కావా ఉంది. అలాగే భారతీయ ఆహారానికీ ఒక జాతీయస్థాయి క్విక్-సర్వీస్ రెస్టారెంట్ బ్రాండ్ ఉండాలన్నదే ఆయన ఆలోచనగా చెబుతున్నారు. "నా మొదటి సంస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాను..ఇప్పుడు సంక్రాంతిని జాతీయ స్థాయికి తీసుకెళుతున్నాను..భారతీయ వంటకాలను వేగంగా అందించడం సంక్లిష్టమైన పని. మొత్తం వ్యవస్థను సరిగ్గా తీర్చిదిద్దడానికి ఐదేళ్ల పాటు కష్టపడ్డాను.. ఈరోజు అది విజయవంతంగా పనిచేస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సంక్రాంతి ఇండియన్ కిచెన్ ప్రస్తుతం అట్లాంటా మిడ్‌టౌన్‌లో ఒక క్యూఎస్ఆర్ నడుపుతోంది. రాబోయే కొన్ని వారాల్లో బక్‌హెడ్, డౌన్‌టౌన్ అట్లాంటాలలో మరో రెండు ప్రారంభం కానున్నాయి. సంక్రాంతి ప్రతినెలా జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్‌లో కూడా సేవలందిస్తోంది. ఇది దేశంలోని అతిపెద్ద కన్వెన్షన్ సెంటర్లలో ఒకటి. ఇక్కడ జరిగే భారీ కార్యక్రమాలకు అమెరికా నలుమూలల నుంచి, ప్రపంచవ్యాప్తంగా సందర్శకులు వస్తారు. ఈ వేసవిలో అట్లాంటాలో జరిగిన ఫిఫా ఫ్యాన్ ఫెస్టివల్‌లో ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది సందర్శకులకు సంక్రాంతి ఇండియన్ కిచెన్ భోజనం అందించింది. తదుపరి దశలో 2027 నుంచి ఫ్రాంచైజీల ద్వారా పొరుగు రాష్ట్రాలకు విస్తరించాలని సంస్థ యోచిస్తోంది.

మహిళ ఫొటోల సేకరణ కేసులో ఐసీఈ అదుపులో భారత సంతతి యువకుడు

అమెరికా: వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించినందుకుగాను భారత సంతతికి చెందిన రాఘుల్ ఆనందకృష్ణన్ అనే వ్యక్తిని అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. తన వ్యక్తిగత ఫొటోలు సేకరించాడని ఓ మహిళ ఫిర్యాదు చేయడంతో ఇప్పటికే అతడిని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో టెక్సాస్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఆనందకృష్ణను తాజాగా ఇమిగ్రేషన్ అధికారులు తమ అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణ పూర్తయ్యే వరకు అతడు తమ ఆధీనంలోనే ఉంటాడని అధికారులు వెల్లడించారు. టెక్సాస్‌లోని ఓ కంపెనీలో పని చేసిన ఆనందకృష్ణన్.. తన ఫోన్‌లోని వ్యక్తిగత ఫొటోలను దొంగచాటుగా తీసుకుని అతడి ఫోన్‌లోకి పంపించు కున్నట్లు సదరు మహిళ ఫిర్యాదు చేయడంతో గతంలో కేసు నమోదైంది.



కెనడాలో అత్యల్పస్థాయికి భారతీయ విద్యార్థులు

కెనడా: కెనడాలో భారతీయ విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గిపోతోంది. ఈ ఏడాది సెప్టెంబరు నాటికే ఈ సంఖ్య బాగా పడిపోయింది. చివరి త్రైమా సికంలో కూడా ఇదే ట్రెండ్ కొనసాగితే గత దశాబ్దకాలంలో ఎన్నడూ చూడని కనిష్ఠాన్ని తాకుతుందని అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. వలస లపై కెనడా ప్రభుత్వ ఆంక్షల నేపథ్యంలో అక్కడ భారతీయ విద్యార్థుల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్న విషయం తెలిసిందే. రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా గణాంకాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరు త్రైమాసికం నాటికి కెనడాలో స్టడీ పర్మిట్ ఉన్న భారతీయ విద్యార్థుల సంఖ్య 51,900. చివరి త్రైమాసికంలోనూ ఇదే ఒరవడి కొనసాగితే భారతీయ విద్యార్థుల సంఖ్య ఈ దశాబ్దంలో ఎన్నడూ చూడని అత్యల్పస్థాయికి పడిపోతుంది. కెనడాలో స్టడీ పర్మిట్‌లు ఉన్న భారతీయ విద్యా ర్థుల సంఖ్య 2023లో 2,77,135గా ఉంది. 2024కు వీరి సంఖ్య 1,88,465కి, 2025లో 94,025కి పడిపోయింది. వీసా నిబంధనలను కఠినతరం చేయడంతో కెనడాలో అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తగ్గిపో యింది. వీసా జారీకి సంబంధించిన కఠిన ఆర్థిక నిబంధనలు, ఫేక్ అప్లికే షన్ల ఏరివేత ఫలితంగా భారతీయ విద్యార్థుల వీసా దరఖాస్తులు పెద్ద సంఖ్యలో తిరస్కరణకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో భారతీయుల్లోనూ కెనడాపై ఆసక్తి తగ్గుతోందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.



వంద రోజులుగా ప్రొరోగ్ కాని పార్లమెంట్



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు గత వంద రోజులుగా ప్రొరోగ్ కాకుండా సరికొత్త రికార్డును నెలకొల్పాయి. వర్షాకాల సమావేశాల్లో ఉభయ సభలను ఆగస్టు 13నే నిరవధికంగా వాయిదా వేశారు. అయినా ప్రొరోగ్ అయినట్టు(సమావేశాలు ముగిసినట్టు) రాష్ట్రపతి ఇంతవరకు ప్రకటించలేదు. 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే లోక్‌సభ సీట్ల పెంపు, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం కోసం ప్రభుత్వం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహించే విషయంలో సస్పెన్స్ కొనసాగుతోంది. లోక్‌సభలో బిల్లు ఆమోదానికి 15 నుంచి 18 ఓట్ల ఆధిక్యం లభిస్తుందనే స్పష్టమైన ధీమాను ఇప్పటికే ప్రభుత్వ వర్గాలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే పార్లమెం టు ప్రత్యేక సమావేశాల నిర్వహణకు అవకాశాలను ప్రభుత్వం అన్వేషిస్తోంది. అయితే, శనివారం సాయంత్రం వరకు ప్రత్యేక సమావేశాల తేదీలను ప్రభుత్వం ప్రకటించలేదు. కాగా, సుదీర్ఘంగా 87 రోజుల పాటు పార్లమెంటు సమావేశాలు ప్రొరోగ్ కాకుండా 2008లో నెలకొన్న రికార్డును తాజాగా అధిగమించడం గమనార్హం. ప్రత్యేక సమావేశాల నిర్వహణపై కొనసాగుతున్న అనిశ్చితి.. డిసెంబరు మొదటి వారంలో మొదలవ్వాల్సిన పార్లమెంటు శీతాకాల సమావేశాలపైనా ఊహాగానాలకు కారణమవుతోంది. ఉభయ సభలు నిరవధికంగా వాయిదాపడిన తర్వాత ప్రొరోగ్ చేయడానికి రాజ్యాంగంలో నిర్దిష్ట గడువు ఏమీ లేదు. నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ సీట్ల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 850కి పెంచడం, అలాగే, 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు ఈ బిల్లులో ప్రభుత్వం ప్రతిపాదించింది. దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ప్రతి రాష్ట్రంలో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెంచాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని ప్రధానమంత్రికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే నాలుగు లేఖలు రాసినా స్పందన లేదని జైరామ్ రమేశ్ ఆక్షేపించారు. 'పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదాపడి నేటికి 100 రోజులైంది. ఇప్పటికీ ప్రొరోగ్ చేయలేదు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు 2/3వ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రధాని, హోంమంత్రి ద్వయం పన్నాగాలు పన్నుతోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రవేశపెట్టిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందలేకపోయింది. ఇప్పుడు కొత్తగా ఆ బిల్లులో ఏం మార్పులు చేశారో ఎవరికీ తెలియదు' అని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు.

భారత్, చైనా కమాండర్ల భేటీ

అరుణాచల్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలపై చర్చ

ఢిల్లీ: భారత్, చైనా మధ్య అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దులో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చకుండా ఇరు దేశాల కమాండర్లు సమావేశమయ్యారు. వాస్తవాధీన రేఖ వెంబడి ఉద్రిక్తతలు పెద్ద సైనిక ఘర్షణకు దారితీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు భారత్, చైనా సైనిక ఉన్నతాధికారులు రెండో విడత కీలక చర్చలు జరిపారు. చలికాలం తీవ్రత పెరగకముందే సరిహద్దులో పరిస్థితులను అదుపులోకి తీసుకురావడమే ఈ సమావేశాల ప్రధాన లక్ష్యం. భారత సైన్యంలోని మూడో కార్ప్స్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ గిరీష్ కాళియా ఈ చర్చల్లో భారత బృందానికి నేతృత్వం వహించారు. చైనా సైనిక ఉన్నతాధికారులు, ఇతర సైనిక ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖకు చెందిన ఒక అధికారి సైతం చర్చలకు హాజరయ్యారు. ఇరు దేశాల సైనికుల మధ్య స్పష్టమైన విధివిధానాలు రూపొందించడం, గస్తీ బృందాల మధ్య ఘర్షణలు



తలెత్తకుండా చూడటం, సమాచార మార్పిడి వ్యవస్థను నిరంతరం కొనసాగించడం వంటి అంశాలపై చర్చిం చారు. ఇంతకు ముందు సెప్టెంబరు 6, 7 తేదీల్లో ఇరు దేశాల సైనిక కమాండర్లు తొలి విడత చర్చలు జరిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కిబితూ ప్రాంతంలో ఉన్న వాచా–దమై సరిహద్దు సమావేశ కేంద్రంలో ఈ భేటీ జరిగింది. అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని తక్సింగ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగినట్లు వచ్చిన నివేదికల నేపథ్యంలో తొలి విడత చర్చలు జరిగాయి. ఇప్పుడు చలికాలం ప్రారంభానికి ముందు మరోసారి సమావేశమై పరిస్థి తులను సమీక్షించారు.

బిహార్‌లో ఆర్జేడీ కార్యకర్తల రణరంగం

పాట్నా: బిహార్‌లో గంగా నదిపై నిర్మించిన నితీశ్ సేతు వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌కు ఆహ్వానం అందలేదన్న కారణంతో ఆర్జేడీ కార్యకర్తలు వంతెనపై నిరసనకు దిగారు. వంతెన ప్రారంభించిన కాసేపటికే ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ చిత్రాలతో ఉన్న పోస్టర్లను చించివేశారు. అలాగే బీజేపీ జెండాలను కాళ్లతో తొక్కుతూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ రూ.4,280 కోట్ల వ్యయంతో నిర్మించిన నితీశ్ సేతు వంతెనను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ పాల్గొన్నారు. అయితే స్థానిక ఎమ్మెల్యే తేజస్వీ యాదవ్‌కు ఆహ్వానం అందక పోవడంపై రాఘోపూర్ ప్రాంతానికి చెందిన ఆర్జేడీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సమయంలో రాష్ట్ర ప్రభుత్వంలో ఆయన భాగస్వామిగా ఉన్నారని గుర్తుచేశారు. ఈ మేరకు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. తేజస్వీ యాదవ్‌కు మద్దతుగా పార్టీ జెండాలు పట్టుకుని వంతెనపై భారీ ర్యాలీ నిర్వహించారు. లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వీకి మద్దతుగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి



సమ్రాట్ చౌధరీ చిత్రాలతో ఉన్న బ్యానర్ల ను చించివేశారు. బీజేపీ జెండాలనూ కాళ్లతో తొక్కారు.

ఈ నిరసన సుమారు 40 నిమిషాల పాటు కొనసాగింది. మరోవైపు, ఈ వంతెనకు మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ పేరు పెట్టడంపై తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. జీవించి ఉన్న రాజకీయ నాయకుడి పేరును ప్రజా నిర్మాణానికి పెట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. సాధారణంగా స్మారక చిహ్నాలకు మరణించిన నాయకుల పేర్లనే పెడతారని గుర్తు చేశారు. ఇది చూస్తుంటే నితీశ్ కుమార్ రాజకీయంగా ముగిసిపోయా రనేది అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఈ వంతెనను నితీశ్ గతంలోనే ప్రారంభించారని, దీని నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులూ రాలేదని తెలిపారు. ఈ వంతెనకు 'అక్షయవత్ రాయ్ సేతు' అని పేరు పెట్టాలని తాను ప్రతిపాదించిన విషయాన్ని తేజస్వీ గుర్తు చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేగా జనవరిలోనే లిఖితపూర్వ కంగా విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే, దీనిపై అసెంబ్లీలో ప్రైవేట్ మెంబర్ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పుకొచ్చారు. కాగా, వంతెనకు నితీశ్ పేరు పెట్టడాన్ని ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరీ సమర్థించారు. రెండు దశాబ్దాల ప్రజాసేవకు గుర్తింపు గా ఈ పేరు పెట్టినట్లు తెలిపారు.

రాజస్థాన్ కోటాలో ఘోర ప్రమాదం

ట్రక్కును కారు ఢీకొని 9 మంది మృతి



రాజస్థాన్: రాజస్థాన్‌లోని కోటాలో ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డుపై పార్కు చేసి ఉన్న ట్రక్కును కారు ఢీకొనడంతో 9 మంది చనిపోయారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారు. మృతులందరికీ ఒకే కుటుంబం. శనివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో కోటాలోని శంభూపుర గ్రామం వద్ద కోటా–ఉదయ్‌పూర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం సంభవించింది. మహారాష్ట్రలో ఒకే కుటుంబానికి చెందిన 15 మంది తమ క్రూయిజ్ కారులో రాజస్థాన్‌లోని శిఖర్ జిల్లాకు వెళ్లారు. అక్కడ కటుశ్యామ్‌జీ ఆలయాన్ని సందర్శించారు. అనంతరం శనివారం రాత్రి తిరిగి మహారాష్ట్రకు పయనమయ్యా రు. ఈ క్రమంలో వారి వాహనం కోటా జిల్లాకు చేరుకుంది. అక్కడ శంభూపుర గ్రామం వద్ద రోడ్డుపై పార్కు చేసిన ట్రక్కును వెహికల్ బలంగా ఢీకొట్టింది. ప్రమాదం గురించి తెలుసుకున్న వెంటనే సహాయక బృందాలు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వాహనంలో ఇరుక్కున్న బాధితులను బయటకు తీసి న్యూ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం వారికి అక్కడ చికిత్స అందిస్తున్నారు. కోటా ఎస్పీ తేజస్విని గౌతమ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రమాదంలో 9 మంది చనిపోయారని కోటా జిల్లా అదనపు కలెక్టర్ రాజేష్ జోషి కన్ఫం చేశారు. చనిపోయిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారని ఆయన తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందేలా చూస్తున్నామని చెప్పారు. ప్రమాదంలో చనిపోయిన వారికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారని వెల్లడించారు.

నీట్ పేపరు లీకేజీ కేసులో 14 మందిపై అభియోగాల నమోదు



న్యూఢిల్లీ: నీట్ పేపరు లీకేజీ కేసులో 14 మంది నిందితులపై స్థానిక ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక న్యాయస్థానం శనివారం అభియోగా లను నమోదు చేసింది. దీంతో కోర్టులో విచారణకు రంగం సిద్ధమయింది. తాము ఎలాంటి తప్పు చేయలేదని నిందితులు వాదించినప్పటికీ ప్రత్యేక జడ్జి అజయ్ గుప్తా మాత్రం వారు పలు నేరాలు చేసినట్టు ప్రాథమిక పరిశీలన ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. మోసం, అవినీతి, పరీక్షల నిర్వహణలో అక్రమాల కు పాల్పడడం వంటి అభియోగాలు మోపారు. ఎన్‌టీఏ తరఫున ప్రశ్నపత్రాల రూపకల్పన విధులు నిర్వర్తించిన ముగ్గురు ప్రభు త్వ ఉద్యోగులు మనీషా గురునాథ్ మంధారే, పి.వి.కులకర్ణి, మనీషా సంజయ్ హవల్దార్‌లను ప్రధాన నిందితులుగా పేర్కొన్నారు.



ట్రంప్‌ను పట్టించుకోని కిమ్

60 అణ్వాయుధాలతో అమెరికాకు సవాల్



ఉత్తర కొరియా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మళ్లీ చర్చలు జరిపేందుకు ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ఆసక్తి చూపడం లేదా? అణ్వాయుధాల విషయంలో వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేకపోవడంతో ఇరు దేశాల మధ్య మరోసారి ఉద్రిక్తతలు పెరుగుతున్నాయా? అవుననే అంటున్నాయి అంతర్జా తీయ మీడియా కథనాలు. అమెరికా అధ్యక్షుడు స్వయంగా సంప్రదించేందుకు ప్రయత్నించినా కిమ్ పట్టించుకోవడం లేదని సమాచారం. ప్రస్తుతం ఉత్తరకొరియా వద్ద సుమారు 60 అణు వార్‌హెడ్‌లు ఉన్నట్లు అంచనాలు వెలువడటం అమెరికాను ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత ఏడాది ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌ను సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం వెల్లడించింది. ఈ కథనం ప్రకారం.. సాధారణ దౌత్య మార్గాలతో పాటు ఇరు దేశాల మధ్య అందుబాటులో ఉన్న ప్రత్యేక సమాచార వ్యవస్థల ద్వారా కూడా సంప్రదింపులకు ప్రయత్నించినప్పటికీ కిమ్ నుంచి స్పందన రాలేదు. దీంతో ట్రంప్ స్వయంగా కిమ్‌కు ఒక లేఖ రాశారు. ఆ లేఖను అందించేందుకు అమెరికా అధికారులు ఉత్తర కొరియా శాశ్వత దౌత్య కార్యాల యం వద్ద వేచి ఉన్నారు. లోపలి నుంచి బయటకు వచ్చిన ఉత్తర కొరియా దౌత్యవేత్తకు అమెరికా ప్రతినిధులు ఆ లేఖను అందించారు. ఆ దౌత్యవేత్త ఆ లేఖను కనీసం తెరవకుండానే తిరిగి అమెరికా ప్రతినిధి ముందు ఉంచినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ తెలిపింది. ట్రంప్ తన తాజా ఆసియా పర్యటన సందర్భంగా కిమ్ జోంగ్ ఉన్‌తో మరోసారి సమావేశం కావాలని భావించారని, చివరి నిమిషం వరకు ఇరు దేశాల మధ్య ముఖాముఖి చర్చల కోసం ప్రయత్నాలు జరిగాయని పేర్కొంది. అయితే ఉత్తరకొరియా షరతులు ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ట్రంప్ వెనుదిరిగారట.

ఉత్తర కొరియా అణ్వాయుధ సామర్థ్యం గత కొన్నేళ్లలో గణనీయంగా పెరిగినట్లు సమాచారం. 2019లో ట్రంప్–కిమ్ మధ్య చర్చలు విఫలమైన తర్వాత ఉత్తరకొరియా అణ్వాయుధాల తయారీని వేగవంతం చేసింది. 2019లో ఆ దేశం వద్ద సుమారు 20 నుంచి 30 అణు వార్‌హెడ్‌లు ఉండగా.. ప్రస్తుతం వాటి సంఖ్య దాదాపు 60కి చేరినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఉత్తర కొరియా అభివృద్ధి చేసిన బాలిస్టిక్ క్షిపణులు (ఐసీబీఎంలు) అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా చేరుకోగల సామర్థ్యం కలిగి ఉన్నట్లు అంచనా. మొబైల్ వాహనాల నుంచి కూడా వీటిని ప్రయోగించే అవకాశం ఉండటంతో గుర్తించడం, అడ్డుకోవడం మరింత కష్టమవుతుంది. ఈ పరిణామాలు అమెరికా రక్షణ వ్యవస్థకు కొత్త సవాళ్లను సృష్టిస్తున్నాయి.

శత్రువుకు పరాభవం తప్పదు..

అమెరికాకు ఐఆర్‌జీసీ చీఫ్ హెచ్చరిక



ఇరాన్: అమెరికా, దాని మిత్రదేశాలకు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కమాండర్ ఇన్ చీఫ్ అహ్మద్ వహీదీ మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. తమతో కొనసాగుతున్న యుద్ధం ఇప్పట్లో ముగిసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తమ శత్రువు గతంలో ఎన్నడూ లేనంతగా అవమానాన్ని ఎదుర్కొనేలా చూస్తామన్నారు. ఇరాన్‌కు చెందిన ఓ మిసైల్ సిటీని వహీదీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ వ్యాఖ్యలు చేశారు. 'శత్రువు ఎదుర్కొంటున్నది ఆరంభం మాత్రమే. రానున్న రోజుల్లో వారు మరింత పరాభవం చవిచూస్తారు. అసత్యంపై సత్యం విజయం సాధించి తీరుతుంది.

అసత్యం నాశ నం కావాలని దేవుడు సంకల్పించాడు' అని వహీదీ వ్యాఖ్యా నించినట్లు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది.

హోర్ముజ్ జలసంధిలో అమెరికా డ్రోన్ కూల్చివేత?

హర్మూజ్ జలసంధి మీదుగా ఎగురుతున్న అమెరికా సైనిక డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించింది. శనివారం తమ ఏరోస్పేస్ ఫోర్స్ కొత్తగా మోహరించిన వైమానిక రక్షణ వ్యవస్థతో అమెరికాకు చెందిన ఎంక్యూ–9 రీపర్ డ్రోన్‌ను కూల్చివేసినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై నిఘా పెట్టిన సమయంలో డ్రోన్‌ను గుర్తించి అడ్డుకున్నామని పేర్కొంది. ఇప్పటివరకు ఇరాన్ కూల్చివేసిన అమెరికా ఎంక్యూ–9 డ్రోన్ల సంఖ్య 58కు చేరిందని ఐఆర్‌జీసీ ప్రకటించింది.

బహ్రెయిన్‌లో అమెరికా రాడార్ కేంద్రంపై దాడి?

మరోవైపు బహ్రెయిన్‌లోని అమెరికా వైమానిక రక్షణ రాడార్ కేంద్రంపై దాడి చేశామని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఈనెల 15న అల్–రీఫా హెలికాప్టర్ స్థావరంలోని రాడార్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని ఆరు డ్రోన్లతో దాడి చేశామని వెల్లడించింది. అమెరికా సైనిక చర్యలకు ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్‌లో భాగంగానే ఈ దాడి జరిగిందని పేర్కొంది. అయితే ఇరాన్ నుంచి వచ్చిన పలు వైమానిక దాడులను తమ రక్షణ వ్యవస్థలు విజయవంతంగా అడ్డుకున్నాయని బహ్రెయిన్ ప్రకటించింది. దీంతో పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి.

హర్ముజ్‌లో రవాణా పునరుద్ధరించాలి

జలసంధిలో ఈదుతూ బ్రిటిష్ స్విమ్మర్ వినతి



హర్ముజ్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్ముజ్ జలసంధిపై తీవ్రంగా ప్రభావం పడుతోం దని, సముద్ర పర్యావరణానికి ముప్పుగా వాటిల్లుతోందని బ్రిటిష్ ఈతగాడు లూయిస్ ప్యూ ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని, వ్యూహాత్మకమైన హర్ముజ్ జలసంధిలో నౌకల రాకపోకలను పునరుద్ధరించాలని కోరారు. దాడుల కారణంగా సముద్రంలో కలిసిన చమురు, ఇతర కాలుష్య శకలా లను తొలగించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్ఈపీ) సముద్రాల పరిరక్షణకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న 56 ఏళ్ల ప్యూ.. ఒమన్ తీరానికి సమీపంలో మూడురోజుల పాటు ఈతకొట్టి సముద్ర పర్యావ ణానికి పొంచి ఉన్న ముప్పును ప్రపంచం దృష్టికి తీసుకొచ్చారు. మొత్తం 15 కిలోమీటర్లు (9.3 మైళ్లు) ఈదారు. ఒమన్‌లోని ముసందమ్ ద్వీపకల్పం నుంచి ప్రారంభించి కేప్ ఆఫ్ హర్ము జ్‌లో కొంత భాగాన్ని ఆయన ఈదారు. మొదటిరోజు నీటిలోకి దిగిన అరగంటకే ఆయన ఈత కొడుతున్న ప్రాంతానికి కొన్ని కిలోమీటర్ల దూరంలో ఓ చమురు నౌకపై దాడి జరిగింది. పేలుళ్ల ధాటికి సముద్ర జలాలు కంపించాయని ప్యూ వెల్లడించారు.

కెనడాలో కాల్పులు..

భారత సంతతి దంపతుల హత్య



కెనడా: కెనడాలోని సర్రే నగరంలో కాల్పులు కలకలం రేపాయి. సర్రే సిటీలో వాల్‌మార్ట్ స్టోర్ బయట పార్కింగ్ స్థలంలో భారత సంతతికి చెందిన దంపతులను దుండగులు కాల్చి చంపారు. ఈ ఘటనను టార్గెటెడ్ కిల్లింగ్‌గా పోలీసులు అనుమాని స్తున్నారు. మృతులను గగన్‌ప్రీత్ రేహల్ అలియాస్ గ్యారీ (23) సుఖ్‌జీత్ కౌర్ (24) గా గుర్తించారు. ఈనెల 15న రాత్రి 10.38 గంటల సమయంలో పార్కింగ్ ప్రదేశంలోవారు గాయాలతో పడి ఉన్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవ సర వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను కాపాడేందుకు ప్రయత్నించారు. అనంతరం వారిని ఆసుపత్రికి తరలించగా.. కొద్దిసేపటికే ఇద్దరూ మృతి చెందినట్లు డాక్టర్లు ప్రకటించారు. మృతులిద్దరూ సర్రే సమీపంలోని డెల్టా పట్టణంలో నివసిస్తున్నట్లు సర్రే పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తును కెనడాలోని ప్రముఖ హత్య కేసుల దర్యాప్తు విభాగమైన ఇంటి గ్రేటెడ్ హోమిసైడ్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఐహెచ్ఐటీ)కి అప్పగించా రు. కాగా.. రేహల్‌పై గతంలో ఆయుధాలకు సంబంధించిన నేరాల కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కాల్పుల ఘటన జరిగిన 13 నిమిషాల తర్వాత సమీపంలో మరో కారు దగ్ధమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ రెండు ఘటనల మధ్య సంబంధం ఉందని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దగ్ధమైన కారే నిందితులు ఉపయోగించిన వాహనం అయి ఉండవచ్చని ఐహెచ్ఐటీ అధికారులు అనుమానిస్తున్నారు. హత్యలు లక్ష్యంగా చేసుకుని జరిగినవేనని, వ్యవస్థీకృత నేర ముఠాలతో సంబంధం ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనతో రెండు కుటుంబాలు తీరని విషాదంలో మునిగిపోయా యని దర్యాప్తు అధికారి ఆవేదన వ్యక్తం చేశారు. కేసుకు సంబం ధించి ఏవైనా వివరాలు తెలిసిన వారు, సీసీటీవీ లేదా డాష్‌క్యామ్ ఫుటేజీ ఉన్నవారు తమను సంప్రదించాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. కాగా.. గత నెలలో బ్రిటిష్ కొలంబియాలోని లాంగ్లీ ప్రాంతంలో దగ్ధమవుతున్న కారులో 25 ఏళ్ల భారతీయ యువకుడి మృతదేహం లభ్యమైంది. మృతుడిని సర్రేలో నివసించే తుషార్ శర్మగా పోలీసులు గుర్తించారు.

డేటింగ్ విషయంలో జాగ్రత్త!

తనయుడితో మెలానియా ట్రంప్



అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భార్య, దేశ ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ తమ తనయుడు బారెన్ ట్రంప్‌కు డేటింగ్ విషయంలో పలు సూచనలు చేశారు. డేటింగ్ ప్రపంచంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండాలని తనయుడికి సలహా ఇచ్చారు. అయితే, తాను మాత్రం అన్ని వేళలా అండగా ఉంటానని బిడ్డకు భరోసా ఇచ్చారు. బారెన్ ట్రంప్‌కు ఇచ్చిన సలహాల గురించి మెలానియా ట్రంప్ స్వయంగా ఓ డాక్యూసీరిస్‌లో తాజాగా వెల్లడించారు. 'బయటి ప్రపంచం ప్రమాదకరం, జాగ్రత్తగా ఉండాలని ఎప్పుడూ నేను చెబుతూ ఉంటా' అని మెలానియా ట్రంప్ అన్నారు. తన బిడ్డతో ఏ విషయంపైనైనా దాపరికాలు లేకుండా మాట్లాడతానని మెలానియా ట్రంప్ చెప్పారు. జీవితంలో సవాళ్లు ఎదుర్కొనే సమ యంలో అతడికి అండగా ఉంటానని అన్నారు. ట్రంప్ సంతా నంలో చిట్టచివరి వాడైన బారెన్ ట్రంప్ సాధారణంగా మీడియాకు దూరంగా ఉంటాడన్న విషయం తెలిసిందే. అయితే, గతేడాది బారెన్ తన ప్రేయసిని ట్రంప్ టవర్‌కు డేట్‌పై తీసుకెళ్లినట్టు అమెరికా మీడియాలో వార్తలు వైరల్‌గా మారింది. తనకు అడ్డంకులు లేకుండా ఆ రోజు బారెన్ వారి టేబుల్ ఉన్న అంతస్తు మొత్తాన్ని మూసేయించినట్టు కూడా తెలిసింది. అయితే తన వ్యక్తిగత వ్యవహారాల గురించి బారెన్ ఎప్పుడూ బహిరంగంగా చర్చించలేదు. తను రిలేషన్‌షిప్‌లో ఉన్నాడా? లేదా? అనే విష యంపై ఎప్పుడూ బయటపడ లేదు. ప్రస్తుతం బారెన్ న్యూయార్క్ యూనివర్సిటీ స్టర్న్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో జూనియర్ సంవత్సరంలో ఉన్నాడు.

మోతెక్కించారు...



- టెస్టు క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన భారత్

- న్యూజిలాండ్‌పై తొలి ఇన్నింగ్స్‌లో 720/9

వెల్లింగ్టన్: వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా పరుగుల సునామీ సృష్టించింది. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 368 పరుగులు చేయగా.. ఆదివారం నాలుగో రోజు రెండో సెషన్‌లో భారత్ 9 వికెట్ల నష్టానికి 720 పరుగుల భారీ స్కోరు వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. పంత్ 153 బంతుల్లో 128(10 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో రాణించాడు. అంషుమన్ కాంబోజ్ 38, ధ్రువ్ జురెల్ 78 పరుగులు చేశారు. దీంతో టీమిండియాకు 352 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.

ఈ క్రమంలోనే టెస్ట్ చరిత్రలోనే నిలిచిపోయే ఓ అరుదైన రికార్డును భారత్ నమోదు చేసింది. టెస్టు చరిత్రలోనే తొలిసారిగా ఒకే ఇన్నింగ్స్‌లో తొలి ఏడు వికెట్లకు 50 అంతకంటే ఎక్కువ పరుగుల భాగస్వామ్యాలు నెలకొల్పిన జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది. అంతేకాకుండా టెస్టు ఇన్నింగ్స్‌లో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సార్లు ఏడు లేదా అంతకంటే ఎక్కువ 50+ భాగస్వామ్యాలు నమోదు చేసిన తొలి జట్టుగానూ భారత్ నిలిచింది. గతంలో 2007లో ఇంగ్లండ్‌తో లార్డ్స్‌లో జరిగిన టెస్టులో భారత్ ఈ ఘనతను సాధించింది. అప్పుడు టీమిండియా ఒకే ఇన్నింగ్స్‌లో 50 లేదా అంతకంటే ఎక్కువ పరుగుల ఎనిమిది భాగస్వామ్యాల ను నమోదు చేసింది. అలానే న్యూజిలాండ్ గడ్డపై భారత్ సాధించిన 720 పరుగులే అత్యధిక స్కోరు కావడం విశేషం. గతంలో 2019లో హామిల్టన్‌లో బంగ్లాదేశ్‌పై కివీస్ చేసిన 715/6 డిక్లేర్డ్ రికార్డును భారత్ అధిగమించింది. కివీస్‌పై టెస్టుల్లో ఇదే అత్యధిక స్కోర్ కావడం విశేషం. గతంలో 1995లో వెల్లింగ్టన్‌లోనే వెస్టిండీస్ 660/5 డిక్లేర్డ్ చేసింది. తాజాగా ఆ రికార్డును టీమిండియా బ్రేక్ చేసింది. మరోవైపు విదేశాల్లో భారత్‌కు ఇదే అత్యధిక టెస్టు స్కోరు కావడం గమనార్హం.

న్యూజిలాండ్ 119/2

రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన న్యూజిలాండ్ నాలుగోరోజు ఆట ముగిసే సమయానికి 119 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయింది.



టెస్టుల్లో జస్ప్రీత్ బుమ్రా అరుదైన రికార్డు

రెండు ఇన్నింగ్స్‌లలో తొలి ఓవర్‌లో వికెట్



వెల్లింగ్టన్: వెల్లింగ్టన్ వేదికగా న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. కివీస్ రెండో ఇన్నింగ్స్‌లోనూ భారత్‌కు శుభారంభం అందించాడు. తాను వేసిన తొలి ఓవర్లలోనే న్యూజిలాండ్ కెప్టెన్ టామ్ లాథమ్‌ను అద్భుతమైన బంతితో పెవిలియన్‌కు పంపాడు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లోనూ బుమ్రా మొదటి ఓవర్‌లోనే లాథమ్ వికెట్‌ను పడగొట్టడం విశేషం. న్యూజిలాండ్ రెండు ఇన్నింగ్స్‌ల తొలి ఓవర్‌లోనే వికెట్లు సాధించడం ద్వారా బుమ్రా ఓ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఒకే టెస్టు మ్యాచ్‌లోని రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తొలి ఓవర్‌లో వికెట్లు తీసిన మూడో భారత బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. బుమ్రా కంటే ముందు శ్రీశాంత్, జహీర్ ఖాన్ మాత్రమే ఈ ఘనత సాధించారు. అలానే న్యూజిలాండ్ టెస్టు బుమ్రాకు మరో మైలురాయిని అందించింది. ఒక టెస్టు మ్యాచ్‌లో తొలి ఓవర్‌లోనే అత్యధిక సార్లు వికెట్ తీసిన భారత బౌలర్ కపిల్ దేవ్ రికార్డును బుమ్రా సమం చేశాడు. వీరిద్దరూ తమ టెస్ట్ కెరీర్‌లో ఈ ఘనతను ఏడుసార్లు సాధించారు. ఓవరాల్‌గా తొలి ఓవర్‌లోనే అత్యధిక సార్లు వికెట్ తీసిన బౌలర్ల జాబితాలో మాజీ ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ అండర్సన్(29 వికెట్లు) అగ్రస్థానంలో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు చెందిన మిచెల్ స్టార్క్ (26 వికెట్లు) చమిందా వాస్(19 వికెట్లు) గ్లెన్ మెక్‌గ్రాత్(19 వికెట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 720 పరుగుల భారీ స్కోర్ సాధించి.. 352 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. కాగా భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (136), రిషభ్ పంత్ (128) శతకాలతో మెరవగా.. యశస్వి జైశ్వాల్(85), దేవ్‌దత్త్ పడిక్కల్(80), శుబ్‌మన్ గిల్(98), ధ్రువ్ జురెల్(78) హాఫ్ సెంచరీలతో రాణించారు.

ఒకే టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌ల్లో తొలి ఓవర్‌లో వికెట్ తీసిన భారత బౌలర్లు

ఎస్.శ్రీశాంత్: వెస్టిండీస్‌పై (కింగ్‌స్టన్, 2006)

జహీర్ ఖాన్: బంగ్లాదేశ్‌పై (మీర్పూర్, 2007)

జస్ప్రీత్ బుమ్రా: న్యూజిలాండ్‌పై (వెల్లింగ్టన్, 2026)



పాక్ ప్లేయర్లే కాదు..
ఆ దేశ అంపైర్లూ ఓవరాక్షన్

ఢిల్లీ: సాధారణంగా ఓవరాక్షన్‌కు పెట్టింది పేరు పాకిస్థాన్ ఆటగాళ్లు. ఏ క్రీడలో అయిన వారు అతిగా ప్రవర్తిస్తుంటారు. అది క్రికెట్‌లో కాస్తా ఎక్కువగా ఉంటుంది. ఇలా పాక్ ప్లేయర్లే ఓవరాక్షన్ చేస్తారనుకుంటే.. వారి జాబితాలో చేరాడు.. ఆ దేశ అంపైర్. ఇటీవల జరిగిన అంధుల క్రికెట్ ఆసియా కప్ 2026 ఫైనల్ మ్యాచ్ అనంతరం పాకిస్థాన్ ఆటగాళ్లు సంబరాలు చేసుకున్నారు. వారితో సంబరాల్లో పాల్గొన్న అంపైర్ ఒకరు.. భారత్‌ను రెచ్చగొట్టేలా జెట్ క్రాష్ సంకేతం చూపాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అంధుల క్రికెట్ ఆసియా కప్ 2026 ఢాకా వేదికగా జరిగింది. ఫైనల్ వర్షం కారణంగా రద్దు అయినా.. ఇరు జట్లనూ సంయుక్త విజేతలుగా ప్రకటించలేదు. నెట్‌రన్‌రేట్ కారణంగా పాక్ విజేతగా ప్రకటించారు.

టోర్నీ నిర్వాహకులు తీసుకున్న నిర్ణయం సరైనది కాదంటూ ఈ ట్రోఫీ ప్రజెంటేషన్‌ను భారత్ బహిష్కరించింది. మరోవైపు ఇండియాపై ఏ స్థాయిలో గెలిచిన పాకిస్థాన్ సంతోషానికి హద్దులు ఉండవు. అలానే అంధుల క్రికెట్‌లో కూడా ఆసియా కప్ 2026 టైటిల్ గెలవడంతో సంబరాలు చేసుకున్నారు. ఏదైనా మ్యాచ్ లేదా టోర్నీలో విజేతగా నిలిస్తే ప్లేయర్లు సంబరాలు చేసుకోవడం షరామామూలే. అంపైర్లు కేవలం ఆటగాళ్లకు శుభాకాంక్షలు తెలిపి పక్కకు వచ్చేస్తారు. కానీ, చెందిన అంపైర్ చేసిన హడావుడి ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చకు దారితీసింది. తమ జట్టుకు కప్ దక్కినందుకు 'ఫ్లైట్ క్రాష్' సంబరాలు చేసుకోవడం విస్మయానికి గురి చేసింది.

దీనిపైనా భారత అంధుల క్రికెట్ సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'ఆసియా కప్ మొత్తం అంపైరింగ్ చేసిన అతడు.. పాక్ జట్టుతో కలిసి ఎలా సంబరాలు చేసుకుంటారు? అంపైర్లు తటస్థంగా ఉండాలనే నిబంధనలనూ బేఖాతరు చేశారు' అంటూ మండిపడింది.

గణేశ్ 'డబుల్' ఆసియా కప్ ఆర్చరీలో రెండు పతకాలు



హాంగ్జౌ (చైనా): తెలుగు యువ ఆర్చర్ గణేశ్ మణిరత్నం తిరుమూరు ఆసియా కప్ ఆర్చరీ ర్యాంకింగ్ మీట్‌లో అదరగొ ట్టాడు. ఈ టోర్నీలో రెండు రజత పతకాలు నెగ్గి 'డబుల్' సాధిం చాడు. ఇక మహిళా ఆర్చర్ ఆదితి స్వామి కూడా టోర్నీలో రెండు పతకాలతో 'డబుల్' దక్కించుకుంది. ఓవరాల్‌గా భారత ఆర్చర్లు 3 రజతాలు, 3 కాంస్యాలతో ఆరు పతకాలు సొంతం చేసుకున్నారు. వీటిలో ఐదు పతకాలు కాంపౌండ్ ఆర్చర్లు నెగ్గగా, ఒక్కటి మాత్రమే రికర్వ్ విభాగంలో రావడం గమనార్హం. నెల్లూరుకు చెందిన 20 ఏళ్ల గణేశ్ కాంపౌండ్ పురుషుల వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్లో 146-148తో బెయిలీ వైల్డ్‌మాన్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓటమిపాలై రజతం అందుకున్నాడు. ఇక, కాంపౌండ్ పురుషుల టీమ్ ఈవెంట్ ఫైనల్లో గణేశ్, మానవ్ మోహిత్‌లతో కూడిన భారత జట్టు 229-234తో ఆస్ట్రేలియా త్రయం చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. ఇక మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో చైనా ఆర్చర్ చేతిలో ఓడి రజతం అందుకున్న అదితి.. టీమ్ ఈవెంట్ ప్లేఆఫ్స్ పోరులో ప్రీతికా ప్రదీప్, తేజల్ సాల్వేతో కలిసి కాంస్యం సాధించింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ప్రీతిక కాంస్యం నెగ్గింది. రికర్వ్ పురుషుల టీమ్ ఈవెంట్‌లో ఉజ్వల్, గోల్డీ మిశ్రా, అభ్యుదయ్‌లతో కూడిన భారత బృందం కాంస్యం సొంతం చేసుకుంది.

చైతన్య రథం
సినిమా
సోమవారం 23 నవంబర్ 2026 X

‘మైసా’ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది



రష్మిక మందన్న తన తాజా చిత్రం మైసా గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఇటలీ, థాయ్‌లాండ్‌లో యాక్షన్ శిక్షణ, అడవుల్లో ప్రమాదకర సన్నివేశాలు, షూటింగ్‌లో గాయాలు, విజయ్ దేవరకొండతో వివాహ జీవితం గురించి మనసులో మాట చెప్పింది. ‘మైసా’ నాకొక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. ఈ సినిమా కోసం ఇటలీ, థాయ్‌లాండ్‌లలో యాక్షన్‌కి సంబం ధించి ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కోపం, బాధ, గుండె పగిలే వేదన, దుఃఖం, పట్టుదల, ధైర్యం, శక్తి... ఇవన్నీ కలిపితేనే ‘మైసా’! షూటింగ్‌లో చాలా గాయాలయ్యాయి. వాటి నుంచి కోలుకోవ డానికి చాలా సమయం పట్టింది. ఎన్నో ఎమోషనల్ పాత్రలు చేశా. కానీ ‘మైసా’ నాకు పూర్తిగా కొత్త అనుభవం. ‘ది గర్ల్‌ఫ్రెండ్’ సినిమా భావోద్వేగంగా ఫీలైతే... ‘మైసా’ కోసం ప్రాణం పెట్టా. కెరీర్‌లో మొదటిసారి షూటింగ్‌కి వెళ్లాలంటేనే వణుకు పుట్టేది. కారణం... అందులోని ప్రమాదకర సన్నివేశాలు. కేరళలోని దట్టమైన అడవుల్లో, కొండ ప్రాంతాల్లో పరిగెత్తడం, జలపాతాల నుంచి దూకడంలాంటివి చేశా. అండర్ వాటర్ సీక్వెన్స్ కోసం రోజుకు ఎనిమిది గంటల పాటు నీళ్లలోనే ఉండాల్సి వచ్చేదని తెలిపింది.

సినిమా విడుదలైన గంటల్లోనే పైరసీ..

రిలీజ్ రోజే నాలుగు సినిమాలు లీక్!



తెలుగు సినీ పరిశ్రమను పైరసీ మాపియా మళ్లీ బలమైన దెబ్బ కొట్టింది. ఆకాశంలో ఒక తారస విడుదలైన తొలి రోజే ఆ సినిమాతో పాటు మరో మూడు తెలుగు సినిమాలు ఒక పైరసీ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమయ్యాయి. తెలుగు పిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రణభాలి, కల్ట్, ‘ఆదర్శకుటుంబం హౌస్ నెంబర్ 47, ‘ఆకాశంలో ఒక తార సినిమాలు పైరసీ జరిగినట్లు శు క్రవారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లోని యాంటీ పైరసీ సెల్ అధికారులు గుర్తించారు. యాంటీ పైరసీ సెల్ నిపుణులు పైరసీని మానిటరింగ్ చేస్తున్న క్రమంలో ఈ నాలుగు సినిమాల పైరేటెడ్ కాపీలను ‘ఇండియా4 మూవీస్.క్లిక్ వెబ్‌సైట్‌లో ప్రత్యక్షం కావడం గమనించి ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు. ఆకాశంలో ఒక తార సినిమా పైరేటెడ్ కాపీ సోర్స్ కనుక్కోవాలని, సినిమా విడుదలైన రోజే అప్లోడ్ చేయడంపై వెనుక ఉన్న వారి పాత్ర గురించి విచారణ చేపట్టాలని యాంటి పైరసీ ప్రాజెక్సెల్ హెడ్ మణీంద్రబాబు ఫిర్యాదులో కోరారు.

త్వరలో గుడ్‌న్యూస్‌లు చెబుతా



‘మొన్నమొన్నటిదాకా చదువు. సినిమాలతో బిజీగా ఉన్నా ఇప్పుడు కూడా. అప్పుడంత బిజీ కావాలని ప్రయత్నిస్తున్నా. త్వరలోనే వరుసగా గుడ్ న్యూస్‌లు చెబుతా” అని శ్రీలీల తెలిపిం ది. ఆమె నటించిన ఓమ్ శు క్రవారం విడుదలైంది. ఈ చిత్రంలో పిల్లాడికి తల్లిగా, ధనుష్‌కి ఇల్లాలిగా నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో కనిపించి మెప్పించింది. ‘ఓమ్’కి తెలుగులో అనుకున్నంత స్పందన రావడం లేదు. అయితే ఈ చిత్రాన్ని చెన్నైలో చూసిన శ్రీలీల మాట్లాడుతూ మంచి రోల్ చేశాను రజనీకాంత్ గారితో నటించాలనే నా కల త్వరలోనే నెరవేరబోతోందని అన్నారు. తదుపరి కార్యాచరణ గురించి చెబుతూ ‘త్వరలోనే స్కిన్ కేర్ బ్రాండ్‌ను మొదలుపెడతానన్నారు. మెడిసిన్‌లో పీజీ చేయడానికి ప్రిపేర్ అవుతున్నా అని భవిష్యత్తులో ఇంకా చాలా చేయాలని ఉంది’ అని అన్నారు.

‘నీతో ఓ అడుగు’...ప్రేమ గీతం అదిరింది



రేసన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై గోపి కృష్ణ జయంతి నిర్మాణంలో, రాధిక జయంతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ‘రాయవలస’. ఈ సినిమాలో కార్తీక్, శ్రీష నులు జంటగా నటిస్తు న్నారు. ఇప్పటివరకు ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్‌తో పాటు ‘రింగుడు రింగుడు’, ‘జాత ర’ పాటలు మంచి స్పందనను రాబట్టుకుని సినిమాపై అంచనాలు ఏర్పడేలా చేశాయి. ఇప్పుడు వాటికి పూర్తి భిన్నంగా, తాజాగా విడుదల చేసిన ‘నీతో ఓ అడుగు’ అనే క్లాసీ రొమాంటిక్ మెలోడీ యూట్యూబ్‌లో చార్ట్‌బస్టర్‌గా నిలుస్తూ శ్రోత లను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ చిత్రంతో కార్తీక్ కేవలం హీరోగానే కాకుండా రచయితగా, సింగర్‌గా తనలోని మల్టీ టాలెంట్‌ను పరిచయం చేస్తుండటం విశేషం.



ఇప్పుడు ‘భోగికి తెలంగాణ యాస

‘నేను మా ఊళ్లో ఉన్నది 13 ఏళ్లే. అప్పుడు మా పల్లెల్లో వాడుక భాషలో ఉన్న మాటలను గుర్తుచే సుకుని ‘భోగి’ పాటల్లో పెట్టా. నేను పాట రాస్తే నిరక్షరాస్యురాలైన మా అమ్మకు అర్థమ వుతుందా? లేదా? అని ఆలోచిస్తా. నేను రాసే పదాలు నేరుగా శ్రోతలతో మాట్లాడుతున్నట్టుండాలి. నా భావాన్ని వాళ్ల మనసు ల్లోకి మోయడానికి దళా రులుండకూడదని నమ్ముతా’ అని ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ అన్నారు. శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో కేకే రాధామోహన్ నిర్మిస్తున్న భోగి సినిమాలో పాటలన్నీ ఆయనే రాశారు.

ఈ నెల 27న ‘భోగి’ విడు దలవుతున్న సందర్భంగా చంద్రబోస్ విలేకరులతో మాట్లాడారు. ‘గతంలో ‘మల్లేశం, ఛాంపియన్’ సినిమాల్లో తెలంగాణ మాండలి కంలో పాటలు రాశాను. అయితే బోగిలో ఒకప్పటి స్వచ్ఛమైన తెలంగాణ పదాలతో పాట సాగుతాయి. నా మాతృయాసలో పాట లు రాసే పనిలో సఫలమయ్యాననే ఆత్మ సంతృప్తి ఉంది. సినీ కవి ప్రతి మాండలికాన్ని పట్టుకోగలగాలి. ‘రంగస్థలం’ కోసం గోదావరి యాసను, ‘పుష్ప’ కోసం చిత్తూరు మాండలికాన్ని ఆకళింపు చేసుకున్నా’ అని అన్నారు. సంపత్ నందికీ స్వతహాగా కవిత్వం అంటే ఇష్టం. ‘భోగి’లో ప్రతి పదాన్ని, పాదాన్ని ఆస్వాదించాం. భీమ్స్ నా స్ఫూర్తితో సినిమా రంగానికి వచ్చానని చెబుతుంటాడు. ఈ సినిమాలో చాలా మంచి సంగీతాన్నిచ్చాడు. ప్రతి పాటా సందర్భోచితంగా సాగుతుంది’ అని తెలిపారు. తన 31 ఏళ్ల సినీ కెరీర్‌లో అత్యధిక సమయం తీసుకుని రాసిన పాట ‘నాటు నాటు’ అని ఆయన అన్నారు.

‘డ్రాగన్’ సింగిల్ పార్టేనా?



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్... ఈ ఇద్దరి పేర్లు వినిపిస్తేనే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు మొదలవుతాయి. ‘దేవర’ తర్వాత తారక్, ‘సలార్’ తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తున్న మోస్ట్ అవేటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘డ్రాగన్’. ఈ సినిమాపై పాన్ ఇండియా రేంజ్‌లో ఏ స్థాయి అంచనాలు ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తొలిసారి వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడం, ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ఆ అంచనాలను ఆకాశానికి చేర్చడంతో.. ‘డ్రాగన్’ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్‌గా మారింది. ఈ సినిమాలో తారక్ లుక్, బాడీ లాంగ్వేజ్ మునుపెన్నడూ చూడని విధంగా పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నాయని గ్లింప్స్‌తోనే క్లారిటీ వచ్చేసింది. అయితే, గత కొన్ని రోజులుగా ఈ సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అసలు ‘డ్రాగన్’ ఎన్ని భాగాలుగా రాబోతోంది? ప్రశాంత్ నీల్ మైండ్‌లో ఉన్న అసలు ప్లాన్ ఏంటి? ఇప్పుడిదే ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. నిజానికి ఈ సినిమాను రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారని, ఒకేసారి రెండు పార్టుల షూటింగ్ పూర్తి చేసి 2027 జూన్ 11న మొదటి భాగాన్ని, ఆ తర్వాత కొద్ది నెలల గ్యాప్‌లోనే రెండో భాగాన్ని విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. కానీ, ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో మరో సంచలన వార్త చక్కర్లు కొడుతోంది. అదేంటంటే.. ‘డ్రాగన్’ రెండు భాగాలుగా కాకుండా, ఒకే ఒక్క పార్ట్‌గా విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయట. ప్రస్తుతం



సెట్స్‌పై కేవలం ఒకే భాగానికి సంబంధించిన షూటింగ్ మాత్రమే జరుగుతోందని, దర్శకుడు ప్రశాంత్ నీల్‌కు ఇప్పటికిప్పుడు పార్ట్-2 చేసే ఆలోచన లేదని టాక్ వినిపిస్తోంది. దీనికి ప్రధాన కారణం ప్రభాస్ ‘సలార్-2’ అని తెలుస్తోంది. 2027 జూన్ 11న ‘డ్రాగన్’ విడుదలైన వెంటనే, ప్రభాస్‌తో ‘సలార్’ సీక్వెల్ షూటింగ్‌ను పట్టాలెక్కించాల్సి ఉంది. ఒకవేళ ‘డ్రాగన్’ను రెండు భాగాలుగా తీస్తే, ‘సలార్-2’ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అందుకే కథను క్రిస్ప్‌గా ఒకే పార్ట్‌లో పూర్తి చేయాలని నీల్ భావిస్తున్నట్లు సమాచారం. అయితే, మరో వర్గం మాత్రం... షూటింగ్ మొత్తం పూర్తయ్యాక, ఎడిటింగ్ టేబుల్ వద్ద ఫైనల్ ఫుటేజ్ నిడివిని బట్టి ఒకే పార్ట్‌గా ఉంచాలా లేక రెండు భాగాలుగా విభజించాలా? అనే దానిపై మేకర్స్ తుది నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు. దీనిపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వస్తే తప్ప పూర్తి క్లారిటీ రాదు.

ఇక ‘డ్రాగన్’ను ప్రశాంత్ నీల్ తన గత చిత్రాల్లా డార్క్, గ్రే షేడ్స్‌లోనే కాకుండా.. ప్రేక్షకులకు ఒక సరికొత్త విజువల్ ట్రీట్ ఇచ్చేలా తీర్చిదిద్దుతున్నారట. ముఖ్యంగా ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌ను అత్యంత కలర్‌ఫుల్‌గా, గ్రాండ్‌గా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. నీల్ మార్క్ డార్క్ టోన్‌కు పూర్తి భిన్నంగా ఉండే ఈ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్, అసలు ఊహకు కూడా అందనంత ట్విస్టులతో, ఎమోషనల్‌గా సాగుతుందని టాక్ వినిపిస్తుంది. ఎన్టీఆర్ ఆర్ట్స్, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ‘డ్రాగన్’కి నీల్ ఆస్థాన సంగీత దర్శకుడు రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తున్నారు. నీల్ సినిమాలకు రవి బస్రూర్ ఇచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఏ రేంజ్‌లో పూనకాలు తెప్పిస్తుందనే దానికి ‘కెజియఫ్’, ‘సలార్’ చిత్రాలే సాక్ష్యాలు. ‘డ్రాగన్’లో అంతకుమిం చిన మ్యూజిక్, బీజీఎమ్ ఉంటుందని ఇండస్ట్రీ వర్గాల్లో బజ్ వినిపిస్తోంది. మొత్తానికి, ఒకవైపు సింగిల్ పార్టా లేక రెండు పార్టులా అనే సస్పెన్స్.. మరోవైపు నీల్ స్టైల్‌కు భిన్నంగా ఉండబోయే కలర్‌ఫుల్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ వంటి వార్తలతో ‘డ్రాగన్’పై హైప్ రోజు రోజుకూ పెరిగిపోతోంది. మరి వచ్చే ఏడాది థియేటర్లలోకి రానున్న ఎన్టీఆర్ – ప్రశాంత్ నీల్ మాస్ విధ్వంసం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.